జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 21 పక్షపత్రిక నవంబర్ 1-15, 2016




## 'పౌరసేవల' నమూనా చట్టాన్ని కేసీఆర్‌కి పంపిన జేపీ

## ప్రజలు 'మార్పు' కి సై అంటే లోక్‌సత్తా దేనికైనా రెడీ !

## యూత్ పార్లమెంట్ 2016 @ ఎడ్యుకేషన్ పాలసీకి విశేష స్పందన








# న్యాయసంస్కరణలు లేకుంటే మరిన్ని సంక్షోభాలు : జేపీ

న్యాయవాది వృత్తి ఉదాత్తమైనదని, ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా సత్వర న్యాయం అందేలా చేసినప్పుడే ఆ వృత్తికి సార్థకత ఏర్పడుతుందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రస్తుతం న్యాయవ్యవస్థ ఆ దిశగా సంస్కరణల్ని చేపట్టకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా మూడు కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వ్యాజ్యాల పరిష్కారంలో జాప్యం వల్ల ప్రజల్లో వ్యవస్థ పట్ల విశ్వాసం సన్నగిల్లుతోందన్నారు. నేరసంస్కృతి పెరుగుతోందన్నారు. హైదరాబాద్ మినర్వా కాఫీషాప్‌లో 'లా' స్కూల్ 101. క్రెసెండో -2016' పేరుతో నిర్వహించిన మ్యూట్ కోర్టు కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. ప్రపంచంలో ప్రజాస్వామిక దేశంలోనూ లేనిరీతిలో మనదేశంలో న్యాయమూర్తులే న్యాయమూర్తుల్ని నియమించుకుంటున్నారని ఆక్షేపించారు. అత్యున్నత న్యాయవ్యవస్థ నియంతలా వ్యవహరించటం మంచిది కాదన్నారు. న్యాయవ్యవస్థ విశ్వసనీయతను, సమర్థతను పెంచకపోతే మున్ముందు సంక్షోభాలు పెరుగుతాయని హెచ్చరించారు. అందుకే న్యాయసంస్కరణల కోసం లోక్‌సత్తా పోరాడుతోందన్నారు. ఇప్పటికే స్థానిక న్యాయాలయాలు, ఎన్‌జేఏసీ వంటి చట్టాల్ని సాధించినా కొన్ని అవరోధాల్ని ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఈ రంగంలో సంస్కరణల్ని రాజకీయ ఏకాభిప్రాయంతో సాధించాల్సుందని జేపీ అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజశేఖర్ గోపాల జోస్యుల, పవన్ కల్లెం, సత్యేంద్రసింగ్, సునీల్ నీలకంఠన్, శ్లోక, వెన్నల కృష్ణ సహా పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక నవంబర్ 1-15, 2016

సంపుటి - 7 సంచిక - 21

## లోపలి పేజీల్లో...

యూత్ పార్లమెంట్ - 2016 .................. 5
పౌరసేవల చట్టం తెస్తున్న తెలంగాణ............ 8
యూత్ పార్లమెంట్ విద్యా చర్చను చూసి........ 10
ప్రభుత్వోద్యోగి లంచాల మేత.... బడుగు జీవిక. 11
అధికారంలో ఉన్నవారి కంటే ఎక్కువ మేలు ..... 15
లోక్‌సత్తా పార్టీ 10వ వార్షికోత్సవం........... 17
గూండాలు, నేరగాళ్లు రాజకీయాల్లోకి వస్తే....... 23
బీసీల ఆరోగ్యం గురించి ఇకనైనా ................ 24
ఆయురారోగ్యఐశ్వర్యాలను అందించే పార్టీ..... 26
భవిష్యత్తు లోక్‌సత్తాదే : భీశెట్టి .................... 27
మోదీ చెప్పింది, తెలంగాణ ప్రభుత్వం ............ 29
ఖర్చే ఖర్చే... ప్రణాళిక - ప్రణాళికేతర తేడా ....... 31
స్టీల్ ఫ్లైవోవర్ బేడా... బెంగళూరును ............. 33
సివిల్ కోడ్‌పై చర్చ మతాలకతీతం కావాలి....... 34

సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# నిద్రాభంగం చేసే పరిణామాలు



కలల్లో విహరిస్తుండటం, ఓటు వేయటం సహా కీలక పనుల్నీ నిద్రలో నడుస్తున్నట్టే చేసే అలవాటున్న మన దేశానికి నిద్రాభంగం చేసే పరిణామాలు కొన్ని ఇటీవల జరిగాయి. మొదటిది 'బ్రిక్స్' సమావేశం! ప్రపంచంలో దాదాపు సగం జనాభాకి ప్రాతినిధ్యం వహించే బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాలతో ఏర్పాటైన బ్రిక్స్ సమావేశం ఈసారి భారత్‌లోనే జరిగింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌ను నిలువరించడానికి కాశ్మీర్ సహా సమస్యల్ని పరిష్కరించే దేశీయ సంస్కరణలు, చాతుర్యం కన్నా కన్నుకు కన్నే సరైన పంథా అని భావించిన మోదీ సర్కారు.. ఆర్థిక లావాదేవీల వేదికైన బ్రిక్స్‌ని అందుకు అవకాశంగా వినియోగించుకోవాలని భావించింది. 'సార్క్'కి అడ్డంకొట్టి పాక్‌ను ఏకాకిని చేసి పాక్ ఆక్రమిత భూభాగంలోకి చొరబడి మరీ సైన్యంతో మెరుపుదాడులు చేయించగలిగారు కాబట్టి బ్రిక్స్‌లో కూడా మోదీ అలవోకగా గెలవగలరని భారతీయులు చాలామంది కలలుగన్నారు. నిజానికి మోదీ విదేశాంగ విధానానికి పెద్ద పరీక్ష ఈ సమావేశం. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మొదటే సమావేశమై తనకనుకూలంగా మలచుకునేందుకు మోదీ వ్యూహాత్మకంగా ప్రయత్నించారు. ఉగ్రవాదం ఆర్థికవ్యవస్థకు చేటు చేస్తోందంటూ పాక్‌ను ఎండగట్టటానికి పుతిన్ కూడా సిద్ధమైనట్టే కనిపించింది. కానీ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వచ్చాక అది తారుమారైంది. ఆర్థిక కష్టాల్లో ఉండి అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటున్న రష్యాను గట్టెక్కించటానికి చైనా వైపు దృష్టి సారించిన పుతిన్.. చివరికి పాత మిత్రుడు భారత్‌కు చేయిచ్చారు. రూ.40వేల కోట్ల పైచిలుకు తన ఆయుధాల్ని భారత్‌కు అమ్ముకుని ఎంచక్కా ఉగ్రవాదం గురించి చైనా పాటి కూడా మాట్లాడకుండా వెళ్లిపోయారాయన. కాశ్మీర్‌లో, దేశంలోని కొన్ని ప్రాంతాలలో ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న జైషే మహ్మద్ వంటి సంస్థలను, వ్యక్తులను ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ గురించి మనం అడిగినా 109 పాయింట్ల 'గోవా డిక్లరేషన్'లో చేర్చలేదు. సిరియాలో ఉగ్రవాద కలాపాలకు పాల్పడుతూ తమకు తలనొప్పిగా మారిన ఐసిస్, జభత్ అల్ నస్రా వంటి వాటిని ఖండించటానికే సదస్సు పరిమితమైంది. మోదీ వాగ్ధాటితో ఎంత ఒప్పించే ప్రయత్నం చేసినా మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ, వాణిజ్య అడ్డంకులు తీర్చే ఏర్పాటు, బ్రిక్స్ రేటింగ్ వ్యవస్థ వంటి ప్రత్యక్ష ఆర్థిక అంశాలకే చైనా పరిమితమైంది. ఏతావాతా భారత్‌కు ఊరటనిచ్చింది న్యూక్లియర్ టీంలోకి రాకుండా మనల్ని అడ్డుకుంటున్న బ్రెజిల్ సానుకూలమవటం, బంగాళాఖాత పరివాహక (బిమ్‌స్టెక్) దేశాలైన బంగ్లాదేశ్, మయన్మార్, శ్రీలంక, థాయ్‌లాండ్, భూటాన్, నేపాల్ దేశాల మద్దతు! ఆకాంక్షలుంటేనే చాలదని, గ్రూపిజం చిట్కాలకో, సెంటిమెంట్‌లకో చింతకాయలు రాలవని చైనా స్పష్టంగా రుజువు చేసింది. చైనా మనదేశాన్ని దాటేసి వెళ్లటం మొదలుపెట్టిన 1970ల సమయంలో అప్పటి పాలకులు, వారి చుట్టూ ఉన్న సోషలిస్టు భావజాలురు చేసిన నిర్వాకం వల్ల మనదేశం ఎంతో నష్టపోయింది. అందరికీ విద్య, ఆరోగ్యం, చిన్న, మధ్యతరహా పరిశ్రమలతో ఉద్యోగాల సృష్టి, అధికార వికేంద్రీకరణ వంటి అంశాలతో కమ్యూనిస్టు చైనా పేదరిక నిర్మూలన చేస్తూ వృద్ధి రేటులో దూసుకెళ్తుంటే, మనదేశంలో సాంప్రదాయ పాలకులు, సోషలిస్టులమని చెప్పుకునేవాళ్లు పేదరికాన్ని పెంచే తాయిలాల్ని, సమ్మెల్ని, రాస్తారోకోల్ని ప్రోత్సహించారు. పారిశ్రామికరంగాన్ని భ్రష్టుపట్టించారు. వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేశారు. ఏటా 52 బిలియన్ డాలర్ల వాణిజ్యలోటుతో చైనా వస్తువుల్ని కొనుక్కోవాల్సిన దుస్థితిని ఏర్పరిచారు. సత్తాలేని వ్యవస్థలు, సోషలిస్టు నమూనా విధానాలు, ప్రజాస్వామ్యం ఉన్నా అంతర్గత ప్రజాస్వామ్యంలేని పార్టీల వల్లే భారత్ వేగంగా ఎదగలేకపోతోంది అని చైనా నుంచి కూడా వ్యంగ్యాల్ని భరించాల్సి వస్తోంది. ఇక, నోబెల్ శాంతి బహుమతిని ప్రజాభిప్రాయ సేకరణ ఫలితంతో సంబంధం లేకుండా కేటాయించటం ఇంకో ఆసక్తికర పరిణామం. కొలంబియా దేశాధ్యక్షుడు జువాన్ శాంటోజ్‌కు శాంతి బహుమతి బహుమతి లభించింది. అనర్హులకు కూడా వచ్చి మహాత్మాగాంధీ వంటి అర్హులకు రాని నోబెల్ అవార్డు గురించి పెద్దగా పట్టించుకోనక్కర్లేదుగానీ.. భావాల్ని ప్రచారం చేసుకోవటానికి ఇలాంటి ప్రాచుర్య అవార్డులు సదవకాశమని విస్మరించకూడదు. దశాబ్దాల సాయుధ అంతర్యుద్ధానికి తెరదించేందుకు జువాన్ ప్రతిపాదించిన శాంతి ఒప్పందాన్ని ప్రజలు తిరస్కరించారనే విమర్శ ఉన్నా.. ప్రపంచ మనుగడకు శాంతిసామరస్యాల ఆవశ్యకతను గుర్తుచేసిందీ అవార్డు. మంచిని గెలిపించలేకపోయినా, మంచి కోసం నిలబడతామని బలమైన సంకేతాలివ్వాలని చాటింది. గెలుపోటములతో సంబంధం లేకుండా లోక్‌సత్తా మంచి రాజకీయానికి వనరులు, 10-20శాతం ఓట్లు ఇచ్చి వుంటే, ఎన్నికలకు పార్టీ విరామం ప్రకటించాల్సిన పరిస్థితే వచ్చేది కాదు. ప్రజలు ఆ మాత్రం సంకేతమిచ్చివుంటే, సాంప్రదాయ పార్టీల మెడల్ని ఈపాటికే వంచగలిగివుండేవాళ్లం. అదలా ఉంచితే.. అంతర్జాతీయంగా ఎప్పటికప్పుడు కొత్త అవసరాలకు తగ్గట్టు సమీకరణాలు మారిపోతున్నట్టే, మన దేశీయంగా కూడా ప్రణాళిక-ప్రణాళికేతర తేడాలు చెరిగిపోయి పాలకులు రోజూ చేసే రూ.10,000కోట్ల ఖర్చు ఎప్పటికప్పుడు తాజా అవసరాలు, ప్రజాప్రతినిధుల పరిణతి మీద ఆధారపడే ధోరణులు స్థిరపడతుండటం, అధికారులు కొంచెం మెరుగ్గా వుంటే రాజకీయ నాయకులతో పెద్దగా అవసరం లేదని నాలుగేళ్లుగా ఎన్నికల్లేని ఓ నగర ప్రజలంటున్నట్టు ఒక వార్తాసర్వేలో తేలటం ఇంకొన్ని గణనీయ పరిణామాలు. వీటన్నిటి సారాంశం ఏమిటీ?.. ఎవరో వచ్చి మన ఆకాంక్షల్ని నెరవేరుస్తారనే భ్రమల నుంచి బైటికి రావాలి, నాయకుల్ని గుడ్డిగా నమ్మకుండా ప్రతిరోజూ అప్రమత్తతతో మన పన్నుల డబ్బు- పాలకుల ఖర్చును గమనిస్తూండాలి, ప్రభుత్వోద్యోగుల చేత మెరుగ్గా పనిచేయిస్తూ పాలకులు అంతకంటే పెద్దపనుల్ని చేయాలి, విద్య, ఆరోగ్యం, వికేంద్రీకరణ వంటి విధానాల రాజకీయం కావాలి, ఇజాల మత్తు నుంచి బైటికొచ్చి నిజాల చుట్టూ నైజాల్ని తిప్పుతూ మంచిని పెంచే వ్యవస్థల్ని నిర్మించుకోవాలి.. మేలు కోవడమా? మళ్లీ నిరంతర నిద్రమత్తులోకే జారుకోవటమా?

మీ

జయప్రకాష్



# లోకాలోకనం

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.


**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com


## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ *నం: 62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# 'యూత్ పార్లమెంట్-2016 @ ఎడ్యుకేషన్ పాలసీ'కి విశేష స్పందన.. మరిన్ని చోట్ల నిర్వహణకు ప్రోత్సాహం

- రవి రాఘవేందర్,
యూత్ పార్లమెంట్ ప్రతినిధి



**2016** అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ), లోక్‌సత్తా ఉద్యమం/ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) నూతన విద్యావిధానంపై ప్రారంభించిన యూత్ పార్లమెంట్ (మేకింగ్ ది మార్క్)కి విశేష స్పందన లభిస్తోంది. తొలుత హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో, ఆ తర్వాత వరంగల్ / హన్మకొండ కాకతీయ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన యూత్ పార్లమెంట్ కార్యక్రమాలకు లోక్‌సత్తా / ఎఫ్‌డీఆర్ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి దిశానిర్దేశం చేశారు. యువత వ్యక్తిగతంగా, సమాజపరంగా ఎదగడానికి కీలకమైన విద్యావిధానంలో మార్పుల గురించి యూత్ పార్లమెంట్– 2016 చర్చించింది. సామాజిక సేవ చేస్తున్న యువతను, ఆసక్తిగల విద్యార్థులను ఒక తాటి మీదకు తెచ్చి విద్యావిధానంపై వారి ఆలోచనలను, సూచనలను నూతన విద్యావిధానంపై కసరత్తు చేస్తున్న ప్రభుత్వానికి తెలియచేయడం, విధానాల రూపకల్పన, చట్టసభలో చర్చల ద్వారా నిర్ణయాలు తీసుకునే ప్రజాస్వామిక రాజకీయం పట్ల యువతలో అవగాహనను, విశ్వాసాన్ని పెంచడం ఈ యూత్ పార్లమెంట్ లక్ష్యం.

విద్యకు పునాది వేసే పాఠశాల విద్యావిధానంలో తీసుకురావాల్సిన మార్పులు, విద్యాప్రమాణాలు పెంచడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలి, స్కూళ్ల ఏకీకరణ, బోధనా మాధ్యమాలు, ప్రభుత్వ–ప్రయివేటు భాగస్వామ్యం, స్థానిక ప్రజల నేతృత్వంలో జవాబుదారీతనం, పర్యవేక్షణ, సామాజిక సేవారంగంలో ఉన్న యువత విద్యారంగానికి ఎలా సేవలు అందించవచ్చు తదితర అంశాల మీద యూత్ పార్లమెంట్‌లలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన జాతీయ విద్యావిధానం (2016) ముసాయిదాలోని అంశాలకు సూచనలను సలహాలను ప్రతిపాదిస్తూ లోక్‌సత్తా/ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) రూపొందించిన డాక్యుమెంట్‌ను ప్రాతిపదికగా చేసుకుని ఈ చర్చ జరిగింది. దేశంలో నాణ్యమైన విద్య కోసం కృషి చేస్తున్న వివిధ సంస్థల (టీఎఫ్ఐ, ప్రథమ్, వైబీఎన్, పీఏసీ, వీఎన్‌యూ, వియ్ ద పీపుల్, యుడబ్ల్యూహెచ్, ఎస్ఎఫ్ఎల్, వీఎఫ్ఎస్, యువ వారధి, విద్యార్థి సత్తా, ఏఆర్ఎఫ్, నిర్మాణ్) ప్రతినిధులు, విద్యార్థులు సలహాసూచనలను అందించారు.






విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ)లోని వైఫల్యాలు పునరావృతం కాకుండా మంచి ప్రమాణాల విద్యను ఎలా అందించాలో యువ పార్లమెంట్ చర్చించింది. పెద్దసంఖ్యలో ఉన్న డ్రాపౌట్లు, విద్యలో ప్రమాణాలు లోపించటం, సుశిక్షితులైన ఉపాధ్యాయుల కొరత, వృత్తి ఒకేషనల్ కోర్సులకు పటిష్ట సంస్థాగత ఏర్పాట్లు లేకపోవటం వంటి లోపాల్ని, స్కూలు చదువుకు-ఉన్నత విద్యకు మధ్య సంబంధం తెగిపోయి విద్య వ్యాపారంగా మారటం వంటి వైఫల్యాలను జాతీయ విద్యావిధానం ముసాయిదా గుర్తించిందని సభ్యులు అభిప్రాయపడ్డారు. దేశ ప్రయోజనాల కోసం పనిచేసే యువతను రూపొందించే సమ్మిళిత విద్యను అందించాలనే తపన కూడా ముసాయిదాలో కనిపించిందన్నారు. అయితే ప్రభుత్వ ముసాయిదాలో ఇంకా అందరికీ నాణ్యమైన విద్యను అందించటంపై స్పష్టత కొరవడిందని, దిశానిర్దేశం లోపించిందని పలువురు సభ్యులు అన్నారు.

మనదేశంలో వివిధ స్థాయిల పాఠశాల విద్యార్థులపై జరిపిన పీసా, అసర్ వంటి ప్రామాణిక సర్వేలను లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ పత్రం ప్రస్తావించింది. కనీసం చదవడం, రాయడం, చిన్న చిన్న లెక్కలు చేయడం, విశ్లేషించడం, తర్కబద్ధంగా ఆలోచించడం, సొంతగా వ్యాఖ్యానించడం, కొత్త పరిష్కారాల్ని చెప్పడం వంటి అంశాల్లో మన స్కూలు విద్యార్థుల్లో అత్యధికులు వెనకబడి వున్నారని ఆ సర్వేలు సాక్ష్యాధారాలతో చెబుతున్నాయి. నేర్చుకున్న చదువులో ప్రమాణాలను పెంచడానికి వీలుగా స్కూళ్లను ఎంచుకునే స్వేచ్ఛను తల్లిదండ్రులకు కల్పించాలన్న లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ సూచనను యువ సభ్యులంతా ఆమోదించారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గితే ఉపాధ్యాయుల జీతాల్ని తగ్గించాలని, అలా మిగిలిన డబ్బుని విద్యార్థుల ట్యూషన్‌కి వెచ్చించాలని చేసిన సూచనను కూడా స్వాగతించారు. విద్యార్థుల సంఖ్య పెరిగితేనే ఉపాధ్యాయుల జీతాలు పెరగటం, విద్యావిధానం టీచర్లు, స్కూళ్ల చుట్టూ కాకుండా విద్యార్థులకు మంచి విద్య చుట్టూ తిరగటం వంటి మార్పుల్ని వెంటనే అమలుచేయాలన్నారు. తల్లిదండ్రులు తమకు దగ్గరలోని మంచి స్కూలు, అది ప్రయివేటుదైనా సరే చేర్చే అవకాశముండాలని, ఫీజును ప్రభుత్వమే చెల్లించాలని అన్నారు. స్థానిక పరిస్థితులకు తగ్గ ఏర్పాట్లతో, పటిష్టమైన జవాబుదారీ వ్యవస్థతో, స్వయందిద్దుబాటు ఏర్పాట్లతో విద్యావిధానం ఉండాలన్న ప్రతిపాదనకు పూర్తి మద్దతిచ్చారు.

దేశంలో డబ్బున్న పైస్థాయి 10-20శాతం గురించి మనం ఆలోచించనక్కర్లేదని, మిగిలిన 80శాతం మందికీ ఎదిగే అవకాశాలు రావాలంటే నాణ్యమైన చదువు, ఆరోగ్యం తప్ప వేరే మార్గాలు లేవని చర్చల్లో ప్యానల్ ఛైర్‌పర్సన్‌గా పాల్గొన్న జేపీ అన్నారు. ఈ 80-90శాతం మంది భవిష్యత్తు కోసం దేశీయ పరిస్థితులకనుగుణంగా నూతన విద్యావిధానానికి లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ సూచనల్ని పంపించాయన్నారు. విద్యారంగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసి ప్రయివేటు శక్తుల్ని పెంచిందికాబట్టి, ఇప్పుడు ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతో పూర్తిగా ప్రభుత్వ పర్యవేక్షణతో విద్యావ్యవస్థను నిర్మించాలన్నారు. యువత, విద్యార్థులు ఇచ్చిన కొన్ని

సూచనలను, ప్రతిపాదించిన సవరణలను పరిశీలించి వారి సందేహాలకు జేపీ సమాధానమిచ్చారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆకెళ్ల రాఘవేంద్ర వంటి ఇతర పెద్దలు కూడా పాల్గొన్నారు. కొందరు తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా పంపుతామని తెలిపారు.



ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించిన యూత్ పార్లమెంటు వివరాల్ని తెలుసుకున్నాక పలు కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థి మిత్రులు తమ ప్రాంగణాల్లో కూడా ఈ పార్లమెంటుని నిర్వహించాలని కోరారు. వారందరికీ ప్రభుత్వం రూపొందించిన బిల్లు, లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ ప్రతిపాదనల కాపీల్ని పంపించాం. మరిన్ని వివరాలకు www.fdrindia.org వెబ్‌సైట్‌లో చూడాలని కోరాం. ఈ సూచనలు, ప్రతిపాదనల్ని క్షుణ్ణంగా చదివి, హేతుబద్ధంగా చర్చనీయంగా ఉండే సూచనల్ని అందించవలసిందిగా కోరాం. ఆ విధంగా జయంతి, సతీష్, వినోద్ నాయక్, రాజీవ్, నందకిషోర్, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మి, శివరామకృష్ణ, మనోజ్, శ్రీనివాస్ తదితరుల చొరవతో, పి. కోదండరామారావు, బండారు రామ్మోహనరావు, ఎన్. శ్రీనివాస్ తదితర లోక్‌సత్తా ఉద్యమ నేతల సహకారంతో కాకతీయ వర్సిటీలో మరో యూత్ పార్లమెంట్-2016ని నిర్వహించాం. తమ మధ్య చర్చ అనంతరం రూపొందించిన సూచనలు, ప్రతిపాదనలపై జేపీతో కూడా చర్చించి తమ ఆలోచనలకు మెరుగుదిద్దుకునే అవకాశాన్ని ఓయూ, కేయూ విద్యార్థులు అద్భుతంగా వినియోగించుకున్నారు. యువ పార్లమెంటులో వచ్చే సూచనలు మెరుగ్గా ఉన్న వాటిని లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ ప్రతిపాదనలకు జోడించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తాం.




ఈ తరానికి చరిత్రలో ఎన్నడూ లేనన్ని అవకాశాలు, వనరులు, టెక్నాలజీ అందుబాటులో ఉన్నాయి. సరైన లక్ష్యాలను గుర్తించి సాధించేందుకు వాటిని ఉపయోగించు కునేందుకు కావలసిన శక్తిసామర్థ్యాలు, ప్రతిభాపాటవాలూ మనకున్నాయా లేదా అన్నదే ప్రశ్న. అవకాశాల్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా మనల్ని తీర్చిదిద్దే విద్యావ్యవస్థ ర్యాంకులు, మార్కులు చట్రంలో కూరుకుపోయింది. వ్యక్తిగత జీవితంలోనే కాదు సమాజాన్ని ప్రభావితం చేసే రాజకీయంలోనూ వైఫల్యానికి విద్యావ్యవస్థలోని అధ్వాన్న పరిస్థితులు కారణమవుతున్నాయి. ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్యమైన, అతి ఎక్కువమంది యువజనాభా వున్న భారత్‌లో అనేకమంది యువనాయకులు రాజకీయాల్లో కనిపించాలి. కానీ ఆ పరిస్థితి లేదు. పేలవమైన వంశపారంపర్య నాయకత్వ ఒరవడి కొనసాగుతోంది. కుల వివక్ష ఇంకా విషం చిమ్ముతోంది. ఉద్యోగాలు దొరక్క, స్వయం ఉపాధిని సృష్టించుకునే శక్తిలేక యువత పొట్టచేత పట్టుకుని నగరాలకు వలసలు పోతున్నారు. పల్లెలు నిర్జనంగా మారుతుండగా, నగరాలకు చేరిన యువత దుర్భర జీవితాల్ని గడుపుతున్నారు. ఈ పరిస్థితినంతటినీ మార్చే శక్తి సరైన విద్యకు ఉంది. అందుకే ఈ బృహత్ ప్రయత్నం. తెలుగు రాష్ట్రాల్లో, ఆ తర్వాత దేశవ్యాప్తంగా కూడా అవకాశమున్న చోట ఈ యూత్ పార్లమెంట్‌లను నిర్వహించాలన్నది మా ప్రయత్నం. ❍

## 'పౌరసేవల చట్టం తెస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు'

# నమూనా చట్టాన్ని కేసీఆర్‌కి పంపిన జేపీ





తెలంగాణ ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా నిర్ణీత గడువులోగా హక్కుగా పనులు జరిగేలా చేసేందుకు ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా ఇప్పటికే రూపొందించిన 'హక్కుగా పౌరసేవల చట్టం' (ఆర్‌టీపీఎస్/సర్వీస్ గ్యారంటీ) ముసాయిదా బిల్లును వినియోగించుకోవాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి డా॥ జయప్రకాష్ నారాయణ్ లేఖ రాశారు. లేఖతో పాటు బిల్లును కూడా జత చేశారు. లేఖను లోక్‌సత్తా వర్గాలు మీడియాకు విడుదల చేశాయి.

**ఆర్‌టీఐ, లోక్‌పాల్ కన్నా శక్తిమంతమైన ప్రజా చట్టమిది, తెలంగాణ సుపరిపాలన ప్రస్థానంలో మైలురాయి అవుతుంది**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు హక్కుగా పౌరసేవల చట్టం తేవాలని కేసీఆర్ సంకల్పించినట్టు వార్తలు చదివానని, ప్రజలకు ఎంతో మేలు చేసే ఈ చొరవను తాను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని లేఖలో జేపీ అన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రతి పనికీ నిర్దిష్ట గడువు.. చెప్పిన సమయంలోగా పని చేయకపోతే ప్రతి రోజూ దరఖాస్తు చేసుకున్న ప్రజలకు నష్టపరిహారం వంటి ఏర్పాట్లతో పకడ్బందీగా, ఆచరణాత్మకంగా రూపొందించిన సర్వీస్ గ్యారంటీ చట్టం తెలంగాణ సుపరిపాలన ప్రస్థానంలో మైలురాయి అవుతుందన్నారు. ఈ చట్టం సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ), లోక్‌పాల్ చట్టంకన్నా చాలా శక్తిమంతమైన ప్రజా చట్టం అవుతుందన్నారు.

**ఆన్‌లైన్ సేవలు సహా అన్నిటికీ ఒకే చట్టం**

సిటిజన్స్ ఛార్టర్లు, సర్వీస్ గ్యారంటీ చట్టంపై ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఉద్యమం ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నాయని జేపీ తెలిపారు. ఈ అంశంపై పార్లమెంటరీ కమిటీ ముందు కూడా చర్చించామన్నారు. పార్లమెంటరీ కమిటీ కోరిక మేరకు సాధారణ ప్రభుత్వ సేవలను, ఎలక్ట్రానిక్ సేవలను కలిపి సింగిల్ బిల్లుగా రూపొందించి ముసాయిదాను అందించామన్నారు. కంప్యూటరీకరణ పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో అన్ని రకాల సేవలనూ ఒకే గొడుగు కిందకు తెచ్చి సామాన్య ప్రజలకు అవసరమైన చాలా సేవలను తేలిగ్గా, నాణ్యమైన రీతిలో అందించే ఒకే చట్టాన్ని అమలు చేయటం అవసరమన్నారు.

**హక్కుగా పౌరసేవలు బిల్లులోని 5 ముఖ్యాంశాల్ని లేఖలో జేపీ పేర్కొన్నారు..**

**1) అన్ని ప్రజాసేవలకు చట్టబద్ధ గ్యారంటీ ఉన్న సిటిజన్స్ ఛార్టర్ల ఏర్పాటు:** ప్రతి రాష్ట్ర ప్రభుత్వ అథారిటీ/సంస్థ తాను అందించే వస్తువులు-సేవలు, బాధ్యులైన అధికారుల పేర్లు ఉన్న జాబితాతో పాటు సిటిజన్స్ ఛార్టర్లను రూపొందించి ప్రకటించాలి. ప్రజలు దరఖాస్తు చేసిన ప్రతి పనిని పూర్తి చేయటానికి నిర్ణీత కాలవ్యవధిని పేర్కొనాలి. ఆలస్యం జరిగినా, ఆ పనిచేయటం సాధ్యం కాదన్నా ఫిర్యాదు చేసుకోవటానికి పటిష్ట యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. అలాగే ఎల్లకాలం పాత ఛార్టర్లనే కొనసాగించకుండా.. నిర్ణీత కాలవ్యవధిలో సిటిజన్స్ ఛార్టర్లను సమీక్షిస్తూ అప్‌డేట్ చేస్తుండాలి.

**2) ప్రజా ఫిర్యాదుల తక్షణ పరిష్కార యంత్రాంగం:** ఫిర్యాదుల తక్షణ పరిష్కారానికి యంత్రాంగంలో భాగంగా ప్రతి

ప్రభుత్వ సంస్థ సమాచార, సహాయ కేంద్రాలను, వినియోగదారుల హెల్ప్ లైన్లు ఏర్పాటు చేయాలి.

దీంతోపాటు పౌరుల నుంచి ఫిర్యాదులు తీసుకుని, విచారణ చేసి పరిష్కరించేందుకు తగినంతమంది అధికారులను ఏర్పాటు చేయాలి. ఫిర్యాదులపై ఇప్పుడు జరుగుతున్నట్టు వ్యాజ్యాల పేరుతో బోలెడంత సమయం, డబ్బు వృధా కాకుండా ఈ చట్టంలో నిర్ణీత గడువులోగా పరిష్కరించే ఏర్పాటు ఉంటుంది. ఉద్యోగి వల్ల తప్పు జరిగి ప్రజలకు సేవ అందలేదనో, జాప్యం జరిగిందనో నిర్ధారించుకుంటే.. జరిమానా, పరిహారంపై స్వతంత్ర అప్పీలేట్ అథారిటీకి పరిష్కార యంత్రాంగం అధికారి సిఫార్సు చేస్తారు.

**పారదర్శకంగా, జవాబుదారీతనంతో, సేవాభావంతో ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరిగేలా చూడాలన్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పాన్ని లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ అందించిన హక్కుగా పౌరసేవల బిల్లు సాకారం చేస్తుందన్న ఆశాభావాన్ని జేపీ వ్యక్తం చేశారు. చట్టం పర్యవేక్షణ, అమలును ఇప్పటికే ఉన్న లోకాయుక్త పరిధిలోకి తేవటం వల్ల ప్రభుత్వ ఖజానాపై ఆర్థికభారం కూడా తగ్గుతుందని, లోకాయుక్త పరిధిలోని న్యాయయంత్రాంగం కూడా బలోపేతమవుతుందని జేపీ అన్నారు.**

**3) పరిష్కార యంత్రాంగం నిర్ణయంపై కూడా అప్పీలుకు అవకాశం:** తన ఫిర్యాదుపై విచారణ సక్రమంగా జరగలేదని పౌరుడు/పౌరురాలు భావించినప్పుడు ముప్పై రోజుల గడువులోగా స్వతంత్ర నిర్దేశిత అథారిటీ (ఐడీఏ)కి అప్పీలు చేయవచ్చు. కార్పొరేషన్/జిల్లా స్థాయిలో ఇది మొదటి అప్పీలేట్ అథారిటీ. ముప్పై రోజులలోగా ఐడీఏ ఈ అప్పీలును పరిష్కరించాలి.

ఆ తర్వాత కూడా పౌరుడు/పౌరురాలికి అసంతృప్తి ఉంటే లోకాయుక్త వద్ద రెండవ అప్పీలును దాఖలు చేయవచ్చు. బిల్లులో లోకాయుక్త అత్యున్నత అప్పీలేట్ అథారిటీగా ఉంటుంది.

**4) జరిమానా, పరిహారం చెల్లింపు విధానం:** దరఖాస్తు చేసుకున్నవారికి సకాలంలో వస్తువులు, సేవలు అందించకుండా విధి నిర్వహణలో తప్పు చేసిన ప్రభుత్వోద్యోగి, ఫిర్యాదు పరిష్కార యంత్రాంగ అధికారి మీద జరిమానా విధించే అధికారాన్ని ముసాయిదా బిల్లు ఐడీఏ, లోకాయుక్తకి కల్పిస్తోంది. సంబంధిత అధికారిపై ఎంత జరిమానా విధిస్తారో అంత మొత్తాన్నీ బాధితునికి చెల్లించాలి. జరిమానా, పరిహారాలకు పరిష్కార యంత్రాంగం చేసిన సిఫార్సులను కూడా పరిశీలించి అప్పీలేట్ అథారిటీ పరిధిలో ధృవీకరిస్తారు.

**5) నిరూపించాల్సిన బాధ్యత అధికారిదే:** ఫిర్యాదు పరిష్కరించాల్సినది కాదని నిరూపించాల్సి వస్తే ఆ బాధ్యత దరఖాస్తుదారుని మీద కాకుండా ఫిర్యాదు పరిష్కార అధికారి మీదే ఉంటుంది.

**లోకాయుక్తదే అత్యున్నత బాధ్యత.. కాబట్టి ఖజానాపై భారం కూడా ఉండదు**

పారదర్శకంగా, జవాబుదారీతనంతో, సేవాభావంతో ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరిగేలా చూడాలన్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పాన్ని లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ అందించిన హక్కుగా పౌరసేవల బిల్లు సాకారం చేస్తుందన్న ఆశాభావాన్ని జేపీ వ్యక్తం చేశారు. చట్టం పర్యవేక్షణ, అమలును ఇప్పటికే ఉన్న లోకాయుక్త పరిధిలోకి తేవటం వల్ల ప్రభుత్వ ఖజానాపై ఆర్థికభారం కూడా తగ్గుతుందని, లోకాయుక్త పరిధిలోని న్యాయయంత్రాంగం కూడా బలోపేతమవుతుందని జేపీ అన్నారు.

"పాలన, ప్రభుత్వోద్యోగ వ్యవస్థ అందరికీ అందుబాటులో, పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండేలా చేసే ఒక పకడ్బందీ చట్టాన్ని అమల్లోకి తెచ్చేందుకు మీతో, మీ అధికారులతో చర్చించటానికి మేం సంతోషంగా సిద్ధం" అని కేసీఆర్‌కు రాసిన లేఖలో జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు.

(లేఖ ప్రతుల్ని సంబంధిత శాఖల తెలంగాణ మంత్రులు కె. తారకరామారావు, ఈటల రాజేందర్, ఎ. ఇంద్రకరణ్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా॥ రాజీవ్ శర్మ, న్యాయ కార్యదర్శి సంతోష్ రెడ్డిలకి పంపారు) ❍




# యూత్ పార్లమెంట్ విద్యా చర్చను చూసి చట్టసభ సభ్యులు సిగ్గుపడాలి: జేపీ



కాకతీయ యూనివర్సిటీలో జరిగిన యూత్ పార్లమెంట్ సమావేశంలో జరిగిన చర్చ తీరుని చూసి ప్రజా ప్రతినిధులమంటూ చట్టసభల్లో ఉన్న వారు సిగ్గుపడాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. వరంగల్ / హన్మకొండ కేయూ సెనేట్ హాల్‌లో యూత్ ఫర్ బెటర్ ఇండియా, విద్యార్థి సత్తా, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ/ఎఫ్‌డీఆర్ ఆధ్వర్యంలో జాతీయ విద్యావిధానంపై జరిగిన యూత్ పార్లమెంట్‌కు జేపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యావిధానం ప్రతిపాదనలు, మార్పులపై పలువురు విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో మాట్లాడారు. విద్యలో సక్సెస్ పట్ల పిల్లల్లో ఇంత ఆకాంక్ష ఉన్నా విద్యావ్యవస్థ బాగు కోసం పట్టించుకోని పాలకులు, వివక్షలు మామూలే అనుకునే సామాజిక ధోరణులు మనదేశ సత్తాని హరిస్తున్నాయని జేపీ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం చదవడం, రాయడం, సామాన్య లెక్కలు, తర్కంతో కూడిన విద్య ఎక్కువమంది పిల్లలకు పట్టుబడటం లేదన్నారు. తాను గాలివాటంగా మాట్లాడటం లేదని, పాఠశాల విద్య బాగాలేదని 'అసర్' సర్వే గత పదేళ్లుగా చెబుతూ వస్తోందని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థి మీదా ఏటా రూ. 39,000 ఖర్చు చేస్తున్నా ఫలితాలు రావటం లేదని అన్నారు. దేశంలో ఇప్పటివరకూ జరిగిన సర్వేలన్నీ– ప్రభుత్వ, ప్రయివేటు తేడా లేకుండా చదువులు బాగాలేదనే తేల్చాయన్నారు. 74 దేశాల మధ్య ఉన్నత పాఠశాల విద్యార్థులపై చేసిన 'పీసా' సర్వేలో మనం 73వ స్థానంలో ఉన్నామన్నారు. దేశంలో బడుగు, బలహీన, ఉన్నత తేడా లేకుండా అందరికీ నాణ్యమైన చదువును ప్రభుత్వం అందించాలన్నారు. యూత్ పార్లమెంట్‌కు ఉస్మానియా కంటే కాకతీయలో స్పందన బాగుందని నిర్వాహకులను అభినందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి నిరోధానికి 'పౌరసేవల చట్టం' అమలుచేస్తామని చెప్పటం హర్షణీయమని, దాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలుచేయాలని జేపీ కోరారు. చట్టం అమలుకు ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి ప్రజలకసేవకు జాప్యం జరిగితే రోజుకు రూ. 250 పరిహారం చెల్లించాలని అన్నారు. చిన్న జిల్లాల్లో విద్యారంగంపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో సతీష్, రవి రాఘవేంద్ర, తోట పవన్, బండారు రామ్మోహనరావు, ఎన్. శ్రీనివాస్, పర్చా కోదండరామారావు, శ్రీనివాస్, జయంతి, రాజీవ్, శివరామకృష్ణ, లక్ష్మీ నర్సింహా, ఎం. శ్రీకాంత్ రెడ్డి, లోక్‌నాయక్, అంగోతు వినోద్ నాయక్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు. ❍

# ప్రభుత్వోద్యోగి లంచాల మేత.. బడుగు జీవిక గోదారి ఈత

- పి.వి గోపాలకృష్ణ, అడ్వకేట్
94404 70848

*ఇందుగలదందులేదన్న సందేహం లేదు*
*ఎందెందో అని సందుసందునా వెతకక్కరలేదు*
*ఇంటర్నెట్‌లో పోర్నోగ్రఫీలా*
*కావలసినవారికి అందుబాటులో*
*అందందే ప్రతి ప్రభుత్వ శాఖలో*
*నగ్నంగా ప్రత్యక్షమౌతుంది..*
అది ఏమిటో.. ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు

ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా ఏ పనైనా సకాలంలో జరగలేదంటే అక్కడ కూర్చున్నవాడు డబ్బుల కోసం ఎదురుచూస్తున్నాడన్న మాటే. లంచం ఇస్తే పనులవుతాయని స్కూల్ పిల్లలకక్కూడా తెలుసు. డబ్బు పారేయండి పనైపోతుంది అంటారు అనుభవజ్ఞులు. చట్టం దాని పని అది ఎందుకు చెయ్యదు అని ప్రభుత్వోద్యోగికి పరీక్ష పెడతామనకుంటే ఎవరు ఫెయిల్ అవుతారో ఎవరికి తెలీదు? అందరికీ తెలుసు. పని అయినప్పుడే అవనీలే అని ఎంత మంది వేచిచూడగలరు. అలా వేచిచూడలేరన్న గ్రహింపు వల్లే లంచాలకి అవకాశం మరింత పెరుగుతుంది.

లంచం ఇవ్వనిదే ఏ ప్రభుత్వ కార్యాలయంలోనూ ఏ పనీ జరగదు అన్నది జనాభిప్రాయం. లంచం ఇవ్వడం తప్పు, నేరం అని కూడా ఎవరూ అనుకోడం లేదు. పనవ్వాలంటే తప్పదుగదా అని అది ఓ జీవితావసరంగా జనం ఒప్పేసుకున్నారు. 2013లో ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వారి సర్వేలో నూటికి నలభై మంది 'గత రెండేళ్ల కాలంలో లంచగొండితనం బాగా పెరిగింది' అని అంటే, కొద్దిగా తగ్గింది అన్న వాళ్లు ఆరుగురే. మన దేశంలో లంచగొండితనంతో పూర్తిగా భ్రష్టుపట్టిన శాఖలు ఏవీ అని అడిగితే 86 శాతం మంది రాజకీయ పార్టీలు అని, 75శాతం మంది పోలీసులు అన్నారు. దేశం మొత్తం మీద ఈ రెండే కాక మరో పది శాఖల్లో- పార్లమెంట్/చట్టసభలు (65శాతం), మిలిటరీ (20శాతం), స్వచ్ఛంద సంస్థలు (30), మీడియా (41), మతసంస్థలు (44), వ్యాపార సంస్థలు (50), విద్యాసంస్థలు (61), న్యాయశాఖ (45), వైద్య, ఆరోగ్య శాఖ




(56శాతం), ఇతర ప్రభుత్వోద్యోగులు, ఉన్నతాధికారులు- ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు (65శాతం)- లంచగొండులున్నారన్న గౌరవాన్ని దక్కించుకున్నాయి. అంటే ఆయా శాఖలతో పనిబడినవారిలో ఆ బ్రాకెట్లలో ఉన్నంతమంది ఆయా శాఖలలోని లంచగొండితనాన్ని ప్రత్యక్షంగా చూశారన్న మాట. సర్వే నాటికి 12 నెలలలోపు కాలంలో పోలీసులకి లంచాలిచ్చామని 62శాతం మంది చెప్పారు. జ్యుడీషియరీకి

లంచం ఇచ్చినవాళ్లు 36శాతం మంది ఉన్నారు. 'అపరిచితుడ'న్నట్టు లంచం ప్రభావం స్మాల్, మీడియం, లార్జ్ అని సైజులు బట్టి ఉండదు. ఐదు పైసలే కదా అనుకుంటే ఐదు కోట్ల మంది ఐదు కోట్ల సార్లు ఐదు పైసలే ఇస్తే ఎంతౌతుంది? బెంగళూరుకి చెందిన జనాగ్రహ అన్న స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న "ఐ పెయిడ్ ఎ బ్రైబ్" అన్న వెబ్‌సైట్ లెక్కల ప్రకారం మనదేశంలో ప్రతి ఇద్దరిలో ఒకరు లంచం ఇవ్వాల్సిన నిర్బంధానికి లోనవుతున్నారు. ఆ అంచనాల ప్రకారం ఒక్క సంవత్సర కాలంలో దేశంలోని పట్టణ ప్రాంత ప్రజలు ప్రభుత్వోద్యోగులకి ముట్టజెప్పే మొత్తం లంచం ఎంతంటే– 6,29,675 రూపాయలు.

ఓస్ అంతేనా.

అంతేనా అంటే అంతే కాదు, అనంతం. ఆ అంకెల పక్కన మరో రెండు అక్షరాలున్నాయి. కోట్లు. అన్ని కోట్లు. 6,29,675 కోట్ల రూపాయలు. ఇది మనందరం కట్టే ఆదాయపు పన్ను కంటే 320 శాతం ఎక్కువ. ఐ పెయిడ్ ఎ బ్రైబ్ వారి ఖచ్చితమైన లెక్కల ప్రకారం 544 పట్టణాలలో 23,091 మంది భారతీయులు మూడేళ్ల కాలంలో అక్షరాల నూట ఎనభై ఆరు కోట్ల, ఏభై ఏడు లక్షల, ఇరవై వేల, ఆరువందల నలభై రెండు రూపాయలు లంచాలుగా సమర్పించుకున్నారు. అంటే తల ఒక్కంటికి సంవత్సరానికి 26,932 రూపాయలు. ఇదే, సెంటర్ ఫర్ మీడియా స్టడీస్, ట్రాన్స్‌పెరెన్సీ ఇంటర్నేషనల్ సంయుక్తంగా నిర్వహించిన ఇండియా కరప్షన్ స్టడీ, 2008 రిపోర్టు ప్రకారం ఒక్క సంవత్సర కాలంలో దారిద్ర్యరేఖకి దిగువనున్న 22,728 కుటుంబాలకి వదిలిన చమురు 8,830 మిలియన్ రూపాయలు. అంటే పక్కన మరో ఆరు సున్నాలు అంటే మొత్తం ఏడు సున్నాలు 883 తరువాత. అంటే అన్ని కోట్లు.

దొంగలు దొంగలు ఊళ్లు పంచుకునే కథ రోడ్ల మీద పోలీసులు, ఆర్టీఏ అధికారుల కథ. సెంటర్ ఫర్ మీడియా స్టడీస్, ఎంఆర్‌డీఏ–మార్కెటింగ్ అండ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ అసోసియేట్స్– సంయుక్తంగా లూధియానా, ఢిల్లీ, ఇండోర్, ముంబయి, కోల్‌కతా, విజయవాడ, బెంగళూరు, చెన్నై వంటి ముఖ్యమైన రోడ్ల కూడళ్లలో గత సంవత్సరం నిర్వహించిన సర్వేలో పాల్గన్నవారిలో పోలీసులకి లంచాలిచ్చినవారు 77శాతం మంది, ఆర్టీఏ అధికారులకి లంచాలిచ్చినవారు 73శాతం మంది. రోడ్ల మీద "చట్టం దాని పని అది చేసుకునేలా" చూస్తూ ఈ రెండు శాఖలూ ఏటా 22,000 కోట్లు దండుకుంటున్నాయి.

అయితే లంచాలివ్వాల్సి వచ్చినవారిలో అకారణంగా ఇవ్వాల్సివచ్చినవాళ్లే కాక సరైన కాయితాలు లేని వాళ్లు, ఓవర్ లోడింగ్, ర్యాష్ డ్రైవింగ్‌గాళ్లు కూడా ఉన్నారు. లంచాలు పుచ్చుకుని పోలీసులు, అధికారులు ఇచ్చే ప్రత్యేకమైన రసీదులు నెలరోజుల పాటు అమలులో ఉంటాయి. అందుకోసం వారు స్పెషల్ హాలోగ్రాంస్, కోడ్ పదాలు వాడుతూంటారు.

ప్రభుత్వ శాఖలు అందించే 11 రకాల సేవలు పొందడానికి ఉత్తరమో (సిఫార్సు), దక్షిణమో (లంచమో) తప్పని పరిస్థితి దేశం మొత్తం మీద ఉత్తరం, దక్షిణం, తూర్పు, పడమర అన్న తేడా లేకుండా సర్వవ్యాప్తం. కాదే రాష్ట్రం లంచానికతీతం. కర్ణాటక, తమిళనాడుల్లో అమితం. మిగిలిన రాష్ట్రాల్లో లంచం అధికం, విపరీతం, భయంకరం అన్న స్థాయిల్లో ఉంది. ప్రభుత్వోద్యోగికి పాపం తన పర భేదం లేదు. తమ వాడే అయినా, జీతం రూపంలోనో, బిల్లులో, పెన్షనో, ఏదైనా సరే ప్రభుత్వం దగ్గర్నుంచి కాసులురాలాలంటే "నాకేంటి" అనగలడు. ఆ విషయంలో కాటికాపరి హరిశ్చంద్రుడితో పోటీపడగలవాడు. ఈ రోజుల్లో సమర్థత, కార్యదక్షత అంటే ఎదుటివాడి– ప్రభుత్వోద్యోగి– బలహీనత గ్రహించి ప్రలోభ పెట్టగలగడం. తక్కినవారి కంటే ముందుగా పనులు పూర్తిచేసుకోగలగడం. గుళ్లు, గోపురాల్లో ఇతరులని తోసిరాజని ముందుగా దర్శనాలు దక్కించుకోవడం, ప్రసాదాలు సంపాదించుకోవడం. సింపుల్‌గా చెప్పాలంటే దర్జాగా లంచాలివ్వగలగడం. పోకిరీలో అలీభాయ్ ఏమిటంటాడు– "రెండో రకం ఉంటారు. ముందు స్ట్రిక్ట్‌గా ఉంటారు. తరవాత కరప్ట్ అయిపోతారు. (నువ్వు) రెండో రకం అయితే చెప్పు.న ఆ చెయ్యి చాలా మంచిది. చాలామందిని కరప్షన్‌లో దింపాను." ఆ పని (కరప్షన్) చెయ్యడానికి ఆలోచించేవాడు, జంకేవాడు/భయపడేవాడు, ఇష్టపడనివాడు చేతికానివాడిగా, బతకడం తెలియనివాడిగా మిగిలిపోతాడు. ఆ పని ధైర్యంగా నైపుణ్యంతో చెయ్యగలిగినవాడు, పనిచేసేవాడికి – పనికావలసినవాడికి మధ్య అనుసంధానకర్తగా లాబీయిస్ట్‌గా, లయసన్‌గా, బతకనేర్చినవాడిగా వెలిగిపోతాడు. లంచం ఇవ్వడం ఇష్టంలేదనేవాడిక్కూడా ఎలాగోలాగ పనవడానికి ఈ మధ్య దళారీ– బ్రోకర్– సేవలు పొందడమే శరణ్యం. దానిక్కారణం ప్రభుత్వోద్యోగుల్లో మొదటిరకం (నీతి, నిజాయతీ అనేవాళ్లు) సంఖ్య తగ్గుతూ రెండో రకం సంఖ్య పెరిగిపోవడం. లంచం మేసైనా, మరెలాగైనా ఎక్స్‌క్లూజివ్ క్లబ్‌లో మెంబర్ అయిపోవాలి. ముందూ వెనకా, కిందా మీదా చూడకుండా డబ్బు సంపాదనే ధ్యేయమైతే డబ్బే డబ్బు. 52 ఏళ్ల మహేష్




చంద్ శర్మ పదేళ్ల క్రితం జయపూర్‌లో కాంపౌండర్. క్రమంగా స్టోర్ కీపర్, నర్స్, లెక్చరర్, ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో అబ్జర్వర్ ఇలా రూపాంతరం చెంది అతను వెనకేసిందెంతో తెలుసా? 200 కోట్లు. పది బ్యాంక్ అకౌంట్లు. 30 ప్రాపర్టీలు, 25 నర్సింగ్ కాలేజీల్లో భాగస్వామ్యం. ఎక్కడెవరికేదివ్వాలో అక్కడక్కడదిస్తూ నర్సింగ్ కాలేజీలకి ప్రభుత్వ అనుమతులు సంపాదించే 'సింగిల్ విండో' అప్రూవర్‌గా మారి తనకు రావలసినది చేతికి చిక్కేదాకా అనుమతులు రాకుండా ఆపగలిగేంత శక్తిమంతుడయ్యాడు. ఆ మధ్య 5లక్షలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా అవినీతి నిరోధక శాఖచేత చిక్కిన వెంటనే ఫోన్ కాల్స్ జడి మొదలైంది. 2010లో సస్పెండ్ అయిన మధ్యప్రదేశ్ ఐఏఎస్ దంపతులు అరవింద్ టినూ జోషీలు నాలుగేళ్ల తర్వాత సర్వీస్ నుంచి డిస్మిస్ అయ్యారు. వాళ్లు అక్రమంగా సంపాదించిన ఆస్తులు రూ.350 కోట్లు. 3 కోట్ల నగదు–25 ఫ్లాట్లు (సెంట్రల్ ఢిల్లీలో), 67 లక్షల నగలు, 7లక్షల విదేశీ కరెన్సీ. వీటిని స్వాధీనం చేసుకునే ప్రయత్నంలోనే ఇంకా ఉంది ప్రభుత్వం.

తెలంగాణలో సస్పెన్షన్‌కి గురైన కరీంనగర్ ఏఎస్పై మోహన్‌రెడ్డి వ్యవహారం, నయీం ఉదంతం పోలీసు శాఖలో అవినీతికి నిలువుటద్దాలు.

దానంతటదే చట్టం దాని పని అది చేయదు. దాన్నమలు చేయడానికి కూర్చున్నవాడే దానికడ్డపడ్డం అంటే కంచే చేను మేయడం. కలుపు తీయడానికి ప్రయత్నించకపోగా పంట నాశనం అయ్యేలా కలుపుని పెంచి పోషిస్తున్నాం.

ఆరేళ్ల తర్వాత కూడా కోయంబత్తూరు కోర్టులో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టున్న కేసు గురించి ఈ మధ్యే పేపర్లో వచ్చింది. లంచాలివ్వకుండా చట్టం దాని పని ఎందుకు చెయ్యదో చూస్తానని నా బోటి అడ్వకేట్ ఎవరో భీష్మించుకున్నాడో ఏమో? ఒక ఆస్తి తగాదా కేసులో సబ్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మీద అక్కడే ఉన్న డిస్ట్రిక్ట్ కోర్టులో ఇద్దరు ప్రతివాదుల్లో ఒకరు 2008లో మరొకరు 2009లో అపీల్ వేశారు. ఇన్నేళ్లుగా కింది కోర్టు నుంచి రికార్డుల కోసం ఎదురుచూస్తూ ఆ అప్పీళ్లు అలాగే పడివున్నాయి. 'అవెయిట్ రికార్డ్స్' అన్న కారణంగా ఒక అపీల్ 89 సార్లు, మరోటి 48 సార్లు వాయిదా పడుతూ లేస్తూ వచ్చాయి.

ఇలాంటి సందర్భాల్లో గోటితో పోయేదే అయినా గొడ్డలి వాడ్డం తప్పనిసరి. తాము నమ్మిన సిద్ధాంతం కోసం సుప్రీంకోర్టు దాకా వెళ్లి లక్షలు ఖర్చు పెట్టిన కేసులూ ఉన్నాయి. కానీ అంతటి wherewithal – వనరులు ఎందరికుంటాయి?

ప్రభుత్వ శాఖలలో సకాలంలో పనులు జరగకపోడానికి ఉద్యోగుల బాధ్యతారాహిత్యం (Deriliction of Duty), చట్టవిద్రోహం (Subversion of Law) కారణాలైతే కోర్టుల దృష్టికి వచ్చినప్పుడైనా సంబంధిత ఉద్యోగుల మీద కఠినమైన చర్యలకి ఆదేశాలివ్వాల్సిన అవసరం ఉంది. పైకేసులో అటువంటి ప్రయత్నం జరిగిందో లేదో?

కోయంబత్తూరు కేసు సందర్భంగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంటర్నెట్ ఇంతగా అభివృద్ధి చెందినా ఆ ఫలాలు ఇంకా కిందిస్థాయి కోర్టులకి చేరకపోడాన్ని ప్రస్తావించి విచారం వెలిబుచ్చారు (ట) జస్టిస్ విమల. మరోపక్క– రోజువారీ ముద్రితమయ్యే కాజ్ లిస్టు ఇకపై ఈ–మెయిల్స్ ద్వారా

అందచెయ్యటానికి ఏర్పాట్లు చేస్తున్నారు జస్టిస్ రోహిణి వంటి వారు. కాగితాల వినియోగాన్ని తగ్గించే ప్రయత్నాలు పచ్చదనాన్ని రక్షించే ప్రయత్నాలు కూడా అవుతాయి. రోజుకి లక్షా యాభైవేల పేజీలు, నెలకి 33 లక్షల పేజీలు ముద్రణ ఆపడం వల్ల రోజుకి 22 చెట్లు, నెలకి 1,320, సంవత్సరానికి 15,000 చెట్లు పరిరక్షించటం జరుగుతుందని అంచనా.

ప్రభుత్వోద్యోగి రోజూ ఆఫీసుకి రాడానికి ప్రభుత్వం జీతం ఇస్తే అక్కడ మన పనులు చేయడానికి మనం లంచం ఇవ్వాలన్న పరిస్థితి మారాలంటే మనం చెయ్యాల్సినదేమిటి? డ్రైవింగ్ టెస్ట్ పాసయ్యాక పాస్డ్ అన్న ముద్రతో రసీదు మన చేతికి వచ్చాక లైసెన్స్ కార్డ్ సకాలంలో మనకి అందకపోతే ఆర్‌టీఐ (సహ చట్టం)ని ప్రయోగించాలేగానీ లంచం ఇచ్చి సంపాదించాలనుకోడం మానాలి. డబ్బులు పారేస్తే అసలు టెస్ట్‌కే వెళ్లకుండా బ్రోకర్లు, డ్రైవింగ్ స్కూలు వాళ్లే అన్నీ ఏర్పాటు చేస్తారులే ఎవరికోసం అని అనుకోవడం కూడా లంచగొండితనాన్ని పెంచి పోషించడమే.

రిజిస్ట్రేషన్ అయిన తరువాత సకాలంలో డాక్యుమెంట్ తిరిగి అందజెయ్యవలసిన బాధ్యత రిజిస్ట్రార్‌ది. సరైన స్టాంప్ డ్యూటీ కట్టి రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక సకాలంలో డాక్యుమెంట్ చేతికి రాకపోతే ఇవ్వాల్సింది లంచం కాదు, జాప్యానికి కారణం అడుగుతూ ఆర్‌టీఐ కింద అప్లికేషన్. వేలల్లో లంచాలిచ్చి లక్షలు ఆదా చేసామనుకుంటే మన చేత్తో మన కన్ను మనమే పొడుచుకోవడమే. ఒక పక్క స్కూళ్లలో కుర్చీలు, బల్లలు లేవు, సరైన మరుగుదొడ్లు లేవు, కొన్ని చోట్ల అసలే లేవు, ఆస్పత్రుల నిర్వహణ అధ్వాన్నం, కోర్టులలో కూర్చోడానికి కుర్చీలు లేవు, తాగడానికి నీళ్లు కూడా లేవు, కరెంటు వచ్చిపోతుంటుంది, ఇది బాగులేదు, అది బాగులేదు అంటూ మరోపక్క కట్టాల్సిన స్టాంప్ డ్యూటీని ఆదా చేయడానికి వేలల్లో లంచాలివ్వడానికి అభ్యంతరం లేదంటే ఎవరిది తప్పు. ఆ స్కూళ్లలో చదువుకుందుకు మన పిల్లలు వెళ్లరు గదా, అటువంటి నరకకూపాలైన ఆస్పత్రులకి మనం ఎందుకు వెళతాం అనుకునేవాళ్లకి కూడా సామాజిక బాధ్యత ఉంటుంది. వరదలు, భూకంపాలు వస్తే ప్రధాని, ముఖ్యమంత్రి నిధులకి విరాళాలిచ్చి మళ్లీ 80 జి మినహాయింపులూ వదులుకోం కదా. ఏ ప్రభుత్వ శాఖ అయినా, లంచాలిచ్చి పని చేయించుకోగలం అన్న ఆలోచనా పద్ధతి మాని, అక్కడ కూర్చున్నవాళ్లు చట్టబద్ధ పాలన ప్రకారం నడుచుకోకపోతే ఆర్‌టీఐ వంటి వాటిని సద్వినియోగం చేసుకోవడానికి అలవాటుపడాలి.

నరేంద్రమోదీ ప్రభుత్వం వచ్చాక కేంద్రంలో పైస్థాయిలో అవినీతి తగ్గిందంటున్నారు. కానీ ఎన్నికలలో గెలవటానికి పార్టీలు పెడుతున్న నల్లడబ్బు వేలకోట్లలో ఉంటోంది. నల్లడబ్బు లేకుండా పార్టీని నడపలేమని ప్రస్తుత ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీయే ఒకానొక సందర్భంలో నిజం మాట్లాడారు. అలాగే దిగువస్థాయిలో అవినీతి ఇంకా పెరుగుతోందే తప్ప తగ్గటం లేదు. ఈ సేవ, మీ సేవ వంటి సాంకేతిక పరిజ్ఞానాల్ని వినియోగించటం వల్ల కొంత ప్రయోజనం కనిపిస్తోందిగానీ వీటికి దొరక్కుండా లంచాలు గుంజే విద్యలో ప్రభుత్వోద్యోగ వ్యవస్థ, వీరికి అండగా వుంటున్న రాజకీయ వ్యవస్థ ఆరితేరుతున్నాయి. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసిపెట్టటమే ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలవటానికి ఇంకా ఏకైక ఫార్ములాగా కొనసాగుతోందంటే, దానర్థం దిగువ స్థాయిలో అవినీతిని మోదీ ప్రభుత్వం కూడా ఏమాత్రం తగ్గించలేకపోయిందని! తగ్గించకపోగా, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వోద్యోగులపై విచారణను అడ్డుకునేలా సవరణలను ప్రతిపాదించింది మోదీ సర్కారు. ఉద్యోగులపై విచారణకు లోక్‌పాల్ అనుమతి కావాలంటూ వంద రోజుల గడువుతో అవినీతి నిరోధక చట్టంలో 17 'ఎ' నిబంధనను చేరుస్తూ ముసాయిదాను తయారుచేసింది. ఇదా అవినీతిని ప్రక్షాళన చేసే పద్ధతి? ఈ నిబంధనను తొలగించాలని లోక్‌సత్తా ఇప్పటికే కేంద్రానికి, ఎంపీలకు కూడా వివరంగా లేఖ రాసింది. దీంతోపాటు ప్రభుత్వ కార్యాలయాలలో లంచాల్ని తగ్గించేలా, నిర్ణీత గడువులోగా ప్రజలకు పని పూర్తిచేయకపోతే రోజుకు రూ.250 వరకు దరఖాస్తుదారునికి పరిహారం చెల్లించేలా 'సర్వీస్ గ్యారంటీ' చట్టాన్ని వెంటనే ఆమోదించాలి. లోక్‌సత్తా రూపొందించిన ఈ చట్టం పార్లమెంటు ముందు పెండింగ్‌లో ఉంది. వీటితో పాటుగా అవినీతిని అంతం చేయటానికి రాజకీయ వ్యవస్థ ఇంకా ఎన్నికల వ్యవస్థలో, పాలనలో బహుముఖ సంస్కరణల్ని అమలు చేయాల్సి ఉంది.

ఆర్‌టీఐ కన్నా శక్తిమంతమైనది సర్వీస్ గ్యారంటీ చట్టం. ఈ అస్త్రాలు ప్రజల చేతుల్లో ఉంటే అవినీతి రోజువారీ ప్రజల జీవితంలో గణనీయంగా తగ్గుతుంది. అవినీతి నిరోధానికి తక్షణ అవసరంగా ఈ చట్టం కోసం కోసం ప్రజలు గళం విప్పాలి. లంచాలిచ్చేవారంతా ఆ డబ్బును పోగేస్తే మన నగరాల్ని స్మార్ట్‌గా మార్చుకోవచ్చు, మన ఏలికలు నిర్మించాలనుకుంటున్న స్మార్ట్ నగరాల్ని సంవత్సరానికి ఒకటి చొప్పున మనమే నిర్మించుకోవచ్చు, ప్రభుత్వాలకి అద్దెకివ్వచ్చు. ❍

**లోక్‌సత్తా పార్టీ 10వ వార్షికోత్సవం**

# అధికారంలో ఉన్నవారి కంటే ఎక్కువ మేలు చేస్తున్నాం, ప్రజలు 'మార్పు'కి సై అంటే, మేం దేనికైనా సిద్ధం: జేపీ



ఓట్లు సీట్లు రాలేదని కాడి పారేయకుండా అధికారంలో వున్న పార్టీలకంటే ఎక్కువగా లోక్‌సత్తా ప్రజల తరపున పనిచేస్తూ విజయాల్ని సాధిస్తోందని, ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో అందరికంటే ముందుగా లోక్‌సత్తా మేలుకొని ప్రభుత్వాల్ని మేలుకొలుపుతోందని, ప్రజలు 'మార్పు'కి సై అని బాహుబలాన్నిస్తే లోక్‌సత్తా ఎంతకైనా రెడీ అని వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

తెలంగాణ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన లోక్‌సత్తా పార్టీ 10వ వార్షికోత్సవంలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జనం జీవితాల్ని మార్చేందుకు, ఆదాయాల్ని పెంచేందుకు కావలసిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు, బలమైన స్థానిక పాలన, చట్టబద్ధపాలన, చౌకగా వేగంగా న్యాయం, వ్యవసాయాన్ని లాభసాటి చేస్తూ గ్రామాలకు–పట్టణాలకు అంతరాన్ని తగ్గించే అభివృద్ధి, సామాన్యులకు రాజకీయాల్లో అవకాశాలు వంటి విధానాల్ని, రాజకీయ సంస్కృతిని లోక్‌సత్తా తప్ప ఇంకెవరు చెబుతున్నారు? వాటి కోసం వ్యవస్థీకృతంగా లోక్‌సత్తా తప్ప ఇంకెవరు పనిచేస్తున్నారు? అని జేపీ ప్రశ్నించారు. వ్యక్తిగత నిజాయతీ ఉన్నవారు సమాజంలో కొందరైనా కనిపిస్తారని, కానీ లోక్‌సత్తా పోరాటం రాజకీయాల్లో, వ్యవస్థలో మార్పు తెచ్చే వ్యవస్థీకృత నిజాయతీ కోసమని అన్నారు. నిజాయతీపరులు, సమర్థులు, వనరులున్నవారు కలిసి వస్తే ఇంకా వేగంగా ఫలితాల్ని సాధించగలమన్నారు. సాంకేతికత పెరిగినంత వేగంగా సమాజంలో మార్పు రాకపోవటం విచారకమన్నారు. సాంకేతిక అభివృద్ధి మానసిక సోమరితనానికి కాకుండా మానసిక చైతన్యానికి దోహదం చేయాలన్నారు.

ప్రజల జీవితాల్ని బాగు చేసే వ్యవస్థను నిర్మించే క్రమంలో లోక్‌సత్తా స్పృశించని రంగమంటూ లేదని, ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని రూపుమాపటానికి 'పౌరసేవల చట్టం' (సర్వీస్ గ్యారంటీ), నాణ్యమైన విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత, న్యాయ సంస్కరణలు, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికలు, దామాషా ఎన్నికల వ్యవస్థ తదితర అంశాల కోసం లోక్‌సత్తా పనిచేస్తోందని జేపీ తెలిపారు. లోక్‌సత్తాకు, కమ్యూనిస్టులకు భావాలపరంగా దగ్గరితనం కనిపిస్తుందని, ఎన్నికల సంస్కరణలకు 2004లో ఒక సదవకాశం వచ్చినప్పుడు లోక్‌సత్తా ఎంత బతిమిలాడినా కమ్యూనిస్టులు కలిసిరాలేదని అన్నారు. దేశంలో విచ్చలవిడిగా డబ్బును వెదజల్లే రాజకీయాలకు తెలుగు గడ్డే పునాది వేసిందని, ఇక్కడ్నుంచి కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలకు విస్తరించటమేకాకుండా ఇప్పుడు జమ్మూకాశ్మీర్‌కు కూడా అంటుకుందని అన్నారు. దామాషా ఎన్నికల పద్ధతి ఆరోజే వచ్చివుంటే ఇప్పుడు దేశంలో



రాజకీయ ముఖచిత్రం భిన్నంగా ఉండేదన్నారు. కమ్యూనిస్టుల్ని కలిసి ఒప్పించేందుకు ప్రయత్నిస్తామని, ఇకనైనా కలిసివస్తారని ఆశిస్తున్నామని జేపీ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వ్యక్తిగతంగా నిజాయతీ పరుడే అయినా, అవినీతిని తగ్గించేందుకు వ్యవస్థలో మార్పు తేలేక పోతున్నారన్నారు. కేంద్రం అవినీతి నిరోధక చట్టంలో ప్రవేశపెట్టిన సవరణలు అవినీతిపరులకే ఊతమిచ్చేట్టున్నా యన్నారు. వీటిని సవరించాల్సిందిగా మోదీకి ఇప్పటికే లేఖ రాశామన్నారు.

లోక్‌సత్తా ఉద్యమం, పార్టీ లక్ష్యాలు ఒక్కటేనని జేపీ స్పష్టం చేశారు. తాము సమస్యల్ని ఎత్తిచూపటమేకాకుండా పరిష్కారాలను కూడా చెబుతామని, వాటిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కూడా కృషి చేస్తామని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యానికి శాశ్వత గ్యారంటీగా ఉండే ప్రజాచైతన్యాన్ని పెంచటంలో లోక్‌సత్తా కృషి సాటిలేదనిదన్నారు. ఎన్నికలలో ప్రజల స్పందన ఆశించినంత లేకపోవటంతో నిరాశచెందో, ఆగ్రహంతోనో తాను ఇక పార్టీ ఎన్నికలలో పోటీచేయదని ప్రకటించలేదని స్పష్టం చేశారు. లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు అంతకుముందు తన ప్రసంగంలో చేసిన వ్యాఖ్యలపై జేపీ ఈ స్పష్టతనిచ్చారు. కనీస స్థాయి ఓట్లు ప్రజల నుంచి రానప్పుడు, ఇతర పార్టీలు రాజకీయ శత్రుత్వ ధోరణుల్ని ప్రదర్శిస్తున్నప్పుడు మనం పార్టీకి అధికారం కోసమే ఆలోచిస్తే జనజీవితంలో ఆశించిన మార్పుల్ని సాధించటం కష్టమవుతుందన్నారు. మనకు అధికారం వచ్చేదాకా వేచివుంటే కాలం గడిచిపోయి ప్రజలు నష్టపోతారన్నారు. లోక్‌సత్తాకు అధికారం ఒక మార్గమే తప్ప గమ్యం కాదని, గమ్యం 'ప్రజల జీవితాల్ని మెరుగుపరిచే వ్యవస్థీకృత మార్పుల్ని తేవటమేనని' అన్నారు. అందుకే ఎన్నికలకు తాత్కాలికంగా విరామం ప్రకటించామన్నారు. ఇది 'అస్త్రం మార్పే తప్ప అస్త్రసన్యాసం కాదని' మళ్లీ మళ్లీ చెబుతున్నానన్నారు. సంస్కరణల్లో భాగంగా ప్రజల్లో జాగృతిని పెంచుతామని, పరిస్థితులు అనుకూలిస్తే అప్పుడు పోటీ గురించి ఆలోచిద్దామని అన్నారు. విశాల దృక్పథం, ఉదాత్త లక్ష్యాల కోసం ఆవిర్భవించిన లోక్‌సత్తా భవిష్యత్తులో సైతం వ్యవస్థలో, రాజకీయాలలో తన పోరాటాల్ని కొనసాగిస్తుందన్నారు. అయినా కూడా పార్టీ ఇప్పుడే ఎన్నికలలో నిలబడాలంటే పార్టీ వ్యవహారాల బాధ్యుల ఇష్టమని, అయితే ఎందుకోసం పోటీచేస్తున్నారో ముందు స్పష్టత తెచ్చుకోవాలని అన్నారు. లోక్‌సత్తా ఎప్పుడూ పరిష్కారంలోనే తప్ప సమస్యలో భాగం కాకూడదన్నారు.

డా॥ పాండురంగారావు మాట్లాడుతూ, ఫిరాయింపులు, గిమ్మిక్కులతో బంగారు తెలంగాణ సాధ్యం కాదని, నిర్మాణాత్మక విధానాల మీద కేసీఆర్ ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. కేంద్రం నుంచి సాయం రాబట్టాలన్నారు. నియంతృత్వ ధోరణుల్ని వీడి ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసం ఉద్యమస్ఫూర్తితో పనిచేయాలన్నారు. డిసెంబర్‌లోగా పార్టీ సంస్థాగత నిర్మాణం పూర్తిచేస్తామన్నారు.

వివిధ వర్గాల సంక్షేమానికి తెరాస ప్రభుత్వం ఇచ్చిన హామీల్ని వెంటనే నెరవేర్చాలని, ఇతర రాజకీయ పార్టీలపై ఫిరాయింపులు, ఇతర అప్రజాస్వామిక దాడులకు స్వస్తిచెప్పి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే విధానాలను అమలు చేయాలని, లోక్‌సత్తా పార్టీ మళ్లీ ఎన్నికలలో పోటీచేస్తుందని పార్టీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాసరెడ్డి ప్రవేశపెట్టిన రాజకీయ తీర్మానాన్ని సదస్సు ఆమోదించింది.

లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీవాస్తవ, జీహెచ్‌ఎంసీ అధ్యక్షుడు దోసపాటి రాము, కోశాధికారి పి. భాస్కరరావు, రాష్ట్ర నేతలు సరోజాదేవి, దుర్గారావు, అనుబంధ సంఘాలు విద్యార్థి సత్తా, యువసత్తా, సాంస్కృతిక సత్తా, కార్మికసత్తా, సమతాసత్తా, మహిళాసత్తాల నేతలు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు, టి.ఎల్. నరసింహారావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల లోక్‌సత్తా శాఖలు, విదేశాల్లో లోక్‌సత్తా భావజాల సంస్థ 'పీపుల్ ఫర్ లోక్‌సత్తా' నేతలు శుభాకాంక్షలను తెలిపారు. ❍

# లోక్‌సత్తా పార్టీ 10వ వార్షికోత్సవం- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నివేదిక

## ప్రజాస్వామ్య పాలనా సంస్కరణల బావుటా - లోక్‌సత్తా



లోక్‌సత్తా ఉద్యమ సంస్థ దాదాపు పదేండ్ల ప్రస్థానం తరువాత 2006 అక్టోబర్ 2న లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించింది. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ పునాది మీద అప్పటికే ఉన్న సాంప్రదాయ పార్టీలకు భిన్నంగా కొత్త తరానికి సరికొత్త రాజకీయం కోసం లోక్‌సత్తా పార్టీ ఏర్పడింది. రాజకీయ పార్టీ అంటే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ అనే నినాదంతో అప్పటికే రాజకీయం అంటే మోసం, రోత, కంపు, అబద్ధాలు అనే విపరీత అర్థాలను తుడిచివేస్తూ యువత, మహిళలు, మేధావులను ఏకం చేస్తూ రాజకీయాలను ఒక పవిత్ర వ్యాసంగంగా పేర్కొంది లోక్‌సత్తా. లోక్‌సత్తా జాతీయ వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమై, ఆ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా మరో 6 రాష్ట్రాలలో లోక్‌సత్తా పార్టీ తన కార్యక్రమాలను ప్రజాక్షేత్రంలో కొనసాగిస్తోంది.

తెలంగాణ రాష్ట్ర మొదటి అధ్యక్షుడు బండారు రామ్మోహనరావు గారి నాయకత్వంలో 2014-15 సంవత్సరం తరువాత 2015 నుంచి ప్రస్తుత అధ్యక్షులు డా॥ పాండురంగారావు గారి నాయకత్వంలో గత రెండు ఏళ్లుగా కొనసాగుతున్నది. ప్రజాసమస్యల విషయంలో ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడంలో, అభిప్రాయాలను ప్రభుత్వాలకు తెలియచేయడంలో ఎలాంటి మొహమాటాలకు భేషజాలకు తావు లేకుండా లోక్‌సత్తా పార్టీ సఫలీకృతం అయింది. లోక్‌సత్తా ప్రధాన ఎజెండాలోని జాతీయ స్థాయి సంస్కరణలతోపాటు స్థానిక సమస్యలైన విద్య, వైద్యం, పౌరసేవలు, అవినీతిరహిత పాలన విషయంలో సర్వేలు, సమావేశాలు, ప్రజాచైతన్య కార్యక్రమాలు నిర్వహించింది. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా ఉపయోగకర పనులను సమర్థిస్తూనే ప్రజా వ్యతిరేకమైన నిర్ణయాలను వ్యతిరేకిస్తుంది లోక్‌సత్తా పార్టీ. దేశ వ్యాప్త రైతు సమస్యలు, న్యాయ, పోలీసు సంస్కరణలు, విద్య, ఆరోగ్య సంస్కరణలకు ఒక పరిష్కార వేదికగా లోక్‌సత్తా వ్యవహరించింది.

హైదరాబాద్‌లోని క్షయ ఆసుపత్రి భవనం (ఎర్రగడ్డ)తోపాటు ఉస్మానియా ఆసుపత్రి, ఇందిరా పార్కు ముందు ఎన్‌టిఆర్ స్టేడియంలో కళాభారతి నిర్మాణం దగ్గర్నుంచి వారసత్వ భవనాలను అసంబద్ధంగా కూల్చివేసే ప్రభుత్వ చర్యలను లోక్‌సత్తా ఎండగట్టింది. ఓటరు లిస్టులలో తప్పొప్పులను సవరించి అడ్డగోలుగా ఓటర్ల తొలగింపును అడ్డుకుంది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ వ్యవహారంలో ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలియచేసింది. రాష్ట్రంలో ప్రాజెక్టుల కోసం, పరిశ్రమల కోసం భూమి సేకరణపై బాధితుల పక్షాన గళమెత్తి సరైన పరిహారం కావాలని నిలబడింది. భూమి సేకరణలో చట్టాలను అమలుచేయాలని కోరింది.

ఇటీవల హైదరాబాద్‌లోని అన్ని పెద్ద ఆసుపత్రులను సందర్శించి రోగులతో, అధికారులతో మాట్లాడి ఆయా ఆసుపత్రులలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం ముందుంచింది. హైదరాబాద్‌లో ఇటీవల భారీ వర్షాల వల్ల నష్టపోయిన బాధితులకు మేము అండగా ఉన్నామని భరోసానిచ్చింది లోక్‌సత్తా.

'మద్యం' సేవించి ప్రమాదాలకు కారణమవుతూ మానవబాంబులుగా వ్యవహరిస్తున్న తాగుబోతులపై కఠిన చర్యలకు ఉపక్రమించేలా హైదరాబాద్‌లో ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చింది. భూ ఆక్రమణలకు పాల్పడే భూ బకాసురులు, అక్రమ

లేఅవుట్ల ద్వారా ప్రజాజీవనానికి ఆటంకం కలిగించే బడా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సింహస్వప్నం అయింది లోక్‌సత్తా.

రెవెన్యూ, పోలీస్, మునిసిపల్ శాఖల అవినీతిని ప్రశ్నించి ప్రజా పక్షాన కార్యక్రమాలు నిర్వహించింది. పార్టీకి సంబంధించిన ఆదాయవ్యయాలు ఆడిటర్‌తో ఆడిట్ చేయించి జమాఖర్చులు సమర్పించి ఆదాయపన్ను అధికారులకు నివేదికను సమర్పించింది లోక్‌సత్తా. దీని ప్రతిని ఎన్నికల కమిషనర్‌కు కూడా జతచేయడమైనది.

లోక్‌సత్తా ప్రస్తుత జాతీయ అధ్యక్షులు శ్రీ సురేంద్ర శ్రీవాస్తవ గారి నాయకత్వంలో, లోక్‌సత్తా సీనియర్ నాయకుల సలహాలు సూచనలతో లోక్‌సత్తా 2019 ఎన్నికల్లో ఒక ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగడానికి ప్రజా ఉద్యమాలు నిర్మిస్తుందని మనవి చేస్తూ లోక్‌సత్తా కార్యకర్తలందరూ మరొకసారి లోక్‌సత్తా ఆశయాలకు పునరంకితం అవుతారని ఆకాంక్షిస్తూ....

**-మీ జన్నేపల్లి శ్రీనివాస్ రెడ్డి**

# 10వ వార్షికోత్సవ రాజకీయ తీర్మానం

తెలంగాణ అస్తిత్వవాదమే ప్రధానంగా తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసింది. నీళ్లు, నిధులు, నియామకాల ట్యాగ్‌లైనే లక్ష్యంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంగా ఆవిర్భవించింది. సిద్ధాంతాలు ఎన్ని ఉన్న, రాజకీయ కోణాలు వేరు వేరు అయినా తెలంగాణ సమాజంలో ఉన్న అన్ని రాజకీయ పక్షాలు, విద్యావంతులు, మేధావులు కోరుకున్నది తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్నే.



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం ఒక వాస్తవం. ఆ తర్వాత బంగారు తెలంగాణ, నవ తెలంగాణ, ప్రజాస్వామిక తెలంగాణ, సామాజిక తెలంగాణ ఇలా రకరకాల పేర్లు పెట్టుకున్న తెలంగాణ సమాజం యావత్తూ అభివృద్ధి పథాన దూసుకుపోవాలన్నదే అందరి ఆశయం. ఈ ఆశయ సాధనకు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ మేరకు విజయం సాధించింది, ఎంతమేరకు విఫలమైంది అన్న అంశం మీదనే లోక్‌సత్తా రాజకీయ తీర్మానం పరిష్కారాలతో నిగ్గుతేల్చింది.

బంగారు తెలంగాణ వైపు అడుగులు పడాలంటే గిమ్మిక్కులు, చీప్ ట్రిక్కులు పనికిరావు. నిర్మాణాత్మకమైన మౌలిక మార్పులకు శ్రీకారం చుడితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. కులాలవారీగా భవనాలు నిర్మించడమో, పాత భవనాలు కూల్చి కొత్తవి నిర్మించడమో అభివృద్ధి నమూనా కాదు, కారాదు.

మానవాభివృద్ధి నివేదిక ప్రకారం మనదేశం ప్రపంచంలోని 135 దేశాల కంటే విద్య, వైద్యంలో వెనకబడి వున్నది. అవినీతిలో మాత్రం అందరికంటే ముందున్నాము. మన పక్కదేశాల కంటే కూడా అవినీతిలో ముందున్నాము. ఇది మన తెలంగాణ రాష్ట్రానికి కూడా పనికివస్తుంది. మన రాష్ట్రంలో కేజీ టూ పీజీ విద్య ప్రవేశపెడతామన్న ప్రభుత్వం వాగ్దానం రెండేళ్లు గడచినా కూడా ఇంకా ఎక్కడవేసిన గొంగళి అక్కడే వుంది.

మధ్యతరగతి వారే కాదు అల్పాదాయవర్గాల వారు కూడా విద్యను కొనుగోలు చేయాల్సి వస్తోంది. అలాగే ఆరోగ్యం కూడా చికిత్స కన్నా నివారణ మేలు అన్న సూత్రాన్ని పాటించని ప్రభుత్వం ఎన్ని ఆరోగ్యశ్రీలు ప్రవేశపెట్టినా, ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి లక్షలకు లక్షలు దానం చేసినా ప్రజారోగ్యం అందని ద్రాక్షపండుగా మారింది. తెలంగాణలో విద్య, వైద్యం అందించని ప్రభుత్వాలు ఎందుకు అన్న ప్రశ్న వస్తుంది.

ఇక రైతుల పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. పంట పండకపోయినా నష్టమే, మంచి వర్షాలు పడి పంట పండినా నష్టమే అనే పరిస్థితి వుంది. దీన్ని మార్చడానికి కేవలం రుణమాఫీ మాత్రమే చేసి అది కూడా నాలుగు విడతలుగా అందిస్తే లాభం లేదు. పండిన పంటకు లాభసాటి ధర వచ్చినప్పుడే రైతు బతుకులు బాగుపడతాయి. దానికి వ్యవసాయాధారిత పరిశ్రమల స్థాపనే సరియైన మార్గం.

ఇక తమది సంక్షేమ ప్రభుత్వమని, దేశంలో ఎక్కడాలేని విధంగా వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత తమదేనని ప్రభుత్వం ప్రజాధనాన్ని ఖర్చు చేసి పెద్దపెద్ద ప్రకటనలు ఇస్తోంది. మనిషి జీవన ప్రమాణాలు పెరగకుండా, విద్య, ఆరోగ్యాలు అందకుండా ఎన్ని సంక్షేమ పథకాలు అమలుచేసినా అది ప్రజలకు 'బిచ్చం' వేసిన చందానే వుంటుంది తప్ప మానవాభివృద్ధికి దోహదపడే చర్య కాదు. సంక్షేమ పథకాలు కేవలం 'పరిహారం' మాత్రమే, పరిష్కారం కాదు అని గుర్తించాలి.

దళితులకు మూడెకరాల భూమి కూడా ప్రారంభ దశలోనే వుండిపోయింది. రాష్ట్రంలోని దళిత కుటుంబాలకు భూమి ఇవ్వడం ఒక పరిష్కారమైతే, వారికి "విద్య" ఇవ్వండి, వారి కాళ్ల మీద వారే నిలబడతారన్న అంబేద్కర్ మాటలు, లోక్‌సత్తా విధానాలు అక్షర సత్యాలు, ఆచరణీయాలు అనే సంగతి ప్రభుత్వం గ్రహించాలి.

### అవినీతి అంతంతోనే అసలైన అభివృద్ధి

గత రెండేళ్ల తెలంగాణ రాష్ట్ర పాలనలో రాజకీయ అవినీతి భాగోతాలు ఇంకా పెద్దఎత్తున వెలుగులోకి రాలేదుగానీ, ప్రజలకు కనీస సేవలందించే అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ అవినీతి గతంలో కంటే పెరిగిందనేది నగ్న సత్యం. పట్టాదారు పాస్‌బుక్ నుంచి మొదలుకొని రెవెన్యూ, మునిసిపల్, పోలీసు, విద్యుత్తు లాంటి ప్రజలతో నిత్యం సంబంధాలు కలిగివున్న అన్ని శాఖల్లోనూ అవినీతి రాజ్యమేలుతోంది. అడపాదడపా అవినీతి నిరోధక శాఖల దాడులలో అవినీతి చక్రవర్తుల నుంచి స్వాధీనం చేసుకొన్న డబ్బు, దస్కం, ఆస్తులు, వివరాలు గమనిస్తే..దొరికితేనే దొంగలు అనే సామెత గుర్తుకొస్తుంది. ఇటీవల పై అధికారులు లంచాలు సమర్పించుకోలేక పోలీసు ఎస్సై, కొందరు సిబ్బంది ఆత్మహత్యలకు పాల్పడటం రోగతీవ్రతను తెలుపుతున్నాయి. ఇవి క్యాన్సర్ పుండుకు లక్షణాలు మాత్రమే, అసలు క్యాన్సర్ అవినీతే అని గుర్తించకపోతే అసలుకే మోసం వస్తుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా సేవలందించే 'పౌరసేవల' చట్టం (లోక్‌సత్తా ఇలాంటి చట్టం కోసం 1998 నుంచి కృషిచేస్తోంది) సహా ఏసీబీ స్వతంత్ర ప్రతిపత్తి, లోకాయుక్తను బలోపేతం చేయటం అవసరం.

### ఫిరాయింపులు - ప్రజాస్వామ్య పరిహాసం

దేశంలోనే కాదు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య పోరాటాల్లో ఒకటిగా సుదీర్ఘకాలం సాగిన ఉద్యమ ఫలితంగా వచ్చిన తెలంగాణలో 2014లో టీఆర్ఎస్‌కు ప్రజలు కట్టబెట్టిన మెజారిటీ కేవలం 52శాతం మాత్రమే. 119 అసెంబ్లీ స్థానాలలో అత్తెసరు మెజారిటీగా 63 అసెంబ్లీ స్థానాలు మాత్రమే ప్రజాతీర్పుగా వచ్చాయి. కానీ ప్రతిపక్షాలకు వచ్చిన స్థానాల నుంచి ఇప్పటికే 27మంది ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌లోకి చేర్చుకోవడంతో ఫిరాయింపులకు పెద్దఎత్తున పూనుకున్న పార్టీగా తయారైంది. ఆ పార్టీకి ప్రజాస్వామ్య విలువల పట్ల ఎంత నిబద్ధత ఉందో అర్థమవుతుంది. పెరుగుట విరుగుట కొరకే అన్నట్టు ఈ ఫిరాయింపులు చివరకు ప్రజాస్వామ్యానికి మచ్చగా మిగిలిపోతున్నాయి.

### లోక్‌సత్తా పార్టీ రద్దు కాలేదు - ఎన్నికల్లో పోటీ చేస్తుంది

లోక్‌సత్తా పార్టీ ఎన్నికల్లో పోటీచేయదనే ప్రకటన తర్వాత లోక్‌సత్తా పార్టీ రద్దయిందనే ప్రచారం పెరిగింది. కానీ అది నిజం కాదు. లోక్‌సత్తా పార్టీ ఎన్నికలకు తాత్కాలిక విరామం ప్రకటించింది. గతంలో దేశంలో మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ కలకత్తా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయక పోయినా, జయలలిత చెన్నైలో పోటీచేయకపోయినా, మన తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ 2009లో హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికలలో పోటీచేయకపోయినా ఆయా పార్టీలు రద్దు కాలేదు. అవి తిరిగి పుంజుకున్నాక వాటి అసలు లక్ష్యాలను సాధించే దిశగా బలోపేతమైనాక మళ్లీ యధాతథంగా ఎన్నికల్లో పోటీ చేశాయి. అలాగే లోక్‌సత్తా ప్రజాపోరాటాల ద్వారా ప్రజల సమస్యలను ప్రతిబింబించి, ప్రజాభిప్రాయాన్ని కూడగట్టుకుని జాగృతం చేసిన తర్వాత మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుంది. కాబట్టి ఇది తాత్కాలిక విరామమేగానీ నిష్క్రమణ కాదు.

ప్రజల మౌలిక సమస్యలపై, పౌరసేవలపై విద్య, వైద్య రంగాల్లో దుస్థితిపై అనేక సమావేశాలు, సర్వేలు, ధర్నాల ద్వారా ప్రజలలో మమేకమై పనిచేస్తుంది. ప్రజల సమస్యల పరిష్కారానికి భావసారూప్యంగల పార్టీలతో కలసి పనిచేస్తుంది.

### భూసేకరణ విధానాలపై ప్రత్యక్షపోరు

రాష్ట్రంలో అనేక కొత్త సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు ఇతర ప్రజావసరాలకు భూమి అవసరమై ప్రజల నెత్తికొట్టి తక్కువ పరిహారంతో భూములు లాక్కునే ప్రభుత్వం తీరును లోక్‌సత్తా నిరసిస్తోంది.

ప్రాజెక్టులు, పరిశ్రమలు భూమ్మీదనే వస్తాయని, ఆకాశంలో రావని లోక్‌సత్తాకు స్పష్టత ఉంది. కానీ కొంతమంది రైతులను దోచి అభివృద్ధిలో వారికి భాగస్వామ్యం కల్పించకపోతే సరైనది కాదని కూడా స్పష్టం చేస్తుంది. తగిన పరిహారంతోపాటు రైతులు సంతోషంగా భూమిని ఇచ్చే పద్ధతులను అనుసరించి భూసేకరణ చేయాలి.

### ప్రతిపక్షాలను నిర్మూలిస్తే ప్రజాస్వామ్యానికే ప్రమాదం

1952లో మొట్టమొదటి పార్లమెంటు ఎన్నికలు జరిగి కాంగ్రెస్ పార్టీకి అప్పటికే నెహ్రూ ప్రధానమంత్రిగా కూడా నేతృత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. జాతీయ ఉద్యమ స్ఫూర్తితో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పెద్దఎత్తున పట్టంకట్టారు. కానీ ప్రతిపక్ష కమ్యూనిస్టులకు కొంతమేర అవకాశం కల్పించారు. అయితే అప్పటి ప్రతిపక్ష నాయకుల వ్యక్తిత్వ,

ఆలోచనా బలం ముందు కాంగ్రెస్ పార్టీ తలవంచక తప్పలేదు. ప్రధానిగా నెహ్రూ వ్యక్తిత్వం కూడా గొప్పదే గనక ప్రతిపక్షం సంఖ్యాబలంగా తక్కువే అయినా ప్రతిపక్షం చెప్పేమాటకు నైతిక విలువనిచ్చారు. అలాగే తన మీద తనే విమర్శలు చేసుకుని కలం పేరుతో అప్పటి పత్రికలలో నెహ్రూ తనపై విమర్శనాత్మక వ్యాసాలు రాసుకునేవారు. అలాంటి ప్రజాస్వామిక సంస్కృతి నుంచి వచ్చిన మనదేశంలో నేటి తెలంగాణలో ప్రతిపక్షం మాటంటే పెడచెవిన పెట్టటమే కాదు, లక్ష్యం చేయకపోవడం మాట అటుంచి.. ప్రతిపక్షాలపై దాడులు చేయండి అనే మాటను స్వయంగా ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు నుంచి రావడం దుర్మార్గం. ప్రజాస్వామిక విలువలకు తిలోదకాలు ఇవ్వడమిది. ముఖ్యమంత్రి ప్రజాస్వామ్యంలో అంతిమతీర్పు ప్రజలేదనని గుర్తించకపోవడం విడ్డూరం. ప్రతిపక్షం సంఖ్యాబలంతో నిమిత్తం లేకుండానే గౌరవించే మంచి సంప్రదాయాన్ని కాదని ప్రతిపక్షాలను ఎద్దేవా చేయడం ముఖ్యమంత్రి తలబిరుసుతనానికి, గర్వానికి చిహ్నం.

ప్రపంచంలో ఎంతోమంది నియంతలు వచ్చారు, పోయారు అన్న నగ్నసత్యాన్ని ముఖ్యమంత్రి గమనించాలి. పదవులు వ్యక్తులు శాశ్వతం కాదు. సమాజం శాశ్వతం–ప్రజలు శాశ్వతం అన్నది మరువరాదు. ప్రతిపక్షాలను గౌరవించని ప్రభుత్వాలకు ప్రజలే తగిన విధంగా గుణపాఠం చెబుతారు.

### నిర్మాణాత్మక ప్రతిపక్షంగా లోక్‌సత్తా పార్టీ

తెలంగాణలో గతంలో అధికారంలో ఉన్న ప్రతిపక్షపార్టీలలో కొన్ని లోపాలున్నాయి. గత పాలనలో తామేం చేశారో అంతకంటే ఇంకా ఎక్కువగా తప్పులు చేస్తూ వస్తున్న ప్రభుత్వాన్ని నిలదీసే నైతికత ఆ సాంప్రదాయ పార్టీలకు లేకుండా పోయింది. ముఖ్యమంత్రి కేసీఆర్ పలుసార్లు కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలపై బ్లాంకెట్‌గా స్టేట్‌మెంట్లు ఇస్తూ కమ్యూనిస్టు పార్టీలపై కూడా నిరంకుశమైన వైఖరిని అవలంబిస్తుంటే.. ఎవరు చెప్పిన కేసీఆర్ వినరని తనకు తోచిందే అనుకున్నదే చేస్తారనే విషయాన్ని ప్రజలు ఈ రెండున్నరేళ్ల పాలనలో తెలుసుకున్నారు. ఇది ఎన్నాళ్లో సాగదు.

ప్రజాసమస్యలపై ప్రభుత్వం పాలనలో చేసిన తప్పిదాలపై కేవలం విమర్శలతోనే సరిపెట్టక ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే పనిని లోక్‌సత్తా పార్టీ చేసింది. అలాగే ప్రభుత్వం చేసే ప్రతి పనిని విమర్శించకుండా మంచిని మంచిగానే చెడును చెడుగానే విమర్శిస్తుంది.

తెలంగాణ రావడానికి పేటెంట్ హక్కు కేవలం టీఆర్ఎస్ పార్టీకే కాదు. అనేక సంవత్సరాలు ప్రజలు, పార్టీలు అన్నీ కలసికట్టుగా పోరాటం చేస్తేనే తెలంగాణ ఏర్పడిందని టీఆర్ఎస్ గమనించవలసి ఉంది.

2019 ఎన్నికల నాటికి ఒక నిర్మాణాత్మక ప్రతిపక్షంగా ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులను ఏకం చేసి కేవలం ప్రభుత్వ తప్పుడు విధానాలను ప్రశ్నించడమే కాదు పరిష్కారాలు కూడా చూపించే పద్ధతిలో లోక్‌సత్తా పోరాడుతుంది.

ఎన్నికల్లో పాల్గొనకపోవడం అనేది ఒక ఎత్తుగడే తప్ప శాశ్వత నిర్ణయం కాదనీ, లోక్‌సత్తా ఆశించే లక్ష్యసాధనకు ఇది వాహనం మార్పే తప్ప ప్రయాణం మానుకోవడం కాదని లోక్‌సత్తా ఎలుగెత్తి చాటుతుంది.

తప్పటడుగులైతే ఫరవాలేదు.. నడక నేర్చుకోవచ్చు

'తప్పు'టడుగులు వేస్తే ప్రమాదం.. తెలంగాణ సమాజానికే నష్టం

తెలంగాణ కొత్త రాష్ట్రం కానీ అప్పుడే రెండేళ్లు దాటిపోయింది. రెండేళ్లలోపు పాప తప్పటడుగులు వేస్తే వేయనిచ్చాంగానీ రెండేళ్ల తర్వాత కూడా తప్పటడుగులు మానకపోతే ఆలోచించాలి. ఇంకా చెప్పాలంటే– నడకనేర్చిన ప్రభుత్వం స్థిరంగా అడుగులు వేసే దిశలో సాగాలి. కానీ రెండేళ్ల తరువాత కూడా "తప్పుడు" అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ సర్వం తానే అయి వ్యవహరిస్తున్నారు. మంత్రివర్గ సమష్టి నిర్ణయం నామమాత్రంగానే ఉంది. కేసీఆర్ ఒక్కడే ఆలోచిస్తున్నారు. మిగిలిన మంత్రులు, అధికారులు అనుసరిస్తున్నారు అనడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ప్రస్తుతానికి రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ ఒక మంచి ఉదాహరణ. ఎన్ని కమిటీలు వేసినా ప్రజా విజ్ఞప్తులు ఎన్ని వచ్చినా, లక్షకు పైగా దరఖాస్తులు వచ్చినా చివరకు కేసీఆర్ తను అనుకున్నదే చేశారు. అఖిలపక్షాన్ని ఒక ఫార్సుగా మార్చివేశారు. ఇలా ఉస్మానియా దవాఖాన, టీబీ ఆసుపత్రులను కూల్చే ప్రకటనల నుంచి నేటి సెక్రటేరియట్ కూల్చే పని వరకు ఆర్భాటపు ప్రకటనలు ఆ తర్వాత వెనక్కి తీసుకోవడం మామూలు దినచర్య అయింది.

కేసీఆర్ తన వ్యవహార శైలిని మార్చుకోవాలి. "సబ్ కా సునా అప్‌నా కర్‌నా"లో కనీసం వినే ఓపిక తెచ్చుకోవాలి– ఆ తర్వాత విస్తృత ప్రజాభిప్రాయం మేరకు ప్రభుత్వంగా ఒక నిర్ణయం తీసుకోవాలి. ఆ నిర్ణయం కనీసం మెజారిటీ ప్రజాస్వామ్యాన్ని గౌరవించే విధంగా ఉండాలి.

ప్రజాస్వామ్యానికి నియంతృత్వం గొప్ప శత్రువు. ప్రజాస్వామిక తెలంగాణ ద్వారానే తెలంగాణకు మేలుజరుగుతుంది.

# వ్యవసాయ విధానం

1. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ నివేదికలను ఆమోదించి పంటల ఉత్పత్తి ఖర్చుపై 50శాతం అధికంగా రైతులకు లాభసాటి ధరలు అందించాలి.

2. వ్యవసాయ పరిశోధన, విస్తరణ వ్యవస్థలు, రైతులకు జవాబుదారీగా ఉండే విధానాలు రూపొందించాలి.

3. సుస్థిర వ్యవసాయానికి పునాది వేస్తూ, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధానాలు రూపొందించాలి.

4. వ్యవసాయదారులు, రైతు కూలీల సంక్షేమ-సామాజిక భద్రత కోసం చట్టం రూపొందించాలి.

5. వ్యవసాయానికి తొమ్మిది గంటల నిరంతర విద్యుత్తు సరఫరా చేయాలి.

6. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా రైతులకు జరుగుతున్న పంట నష్టాల అంచనాలలో జాప్యాన్ని నివారించి, పంట బీమా సొమ్మును, పంటల పెట్టుబడి నష్టాన్ని ఎకరాకు రూ. 10వేలు చొప్పున వెంటనే చెల్లించాలి (హుదా కమిటీ సిఫారుసు).

7. సమగ్రమైన పంటల బీమా పథకాన్ని రూపొందించి బీమా ప్రీమియం 10శాతం రైతులు, 90శాతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలి.

8. బీమా నష్టపరిహారాన్ని విపత్తు జరిగిన 15 నుంచి 20 రోజుల్లో రైతులకు అందించాలి.

9. రైతులకు స్వల్పకాలిక దీర్ఘకాలిక రుణాలను సులభమైన షరతులతో అందించాలి.

10. వివిధ పంటలకు, వాస్తవ ఉత్పత్తి ఖర్చుల ఆధారంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించి రైతులకు రుణాలు మంజూరు చేయాలి.

11. రైతులకవసరమైన నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలి. విత్తనాల ధరలు, నాణ్యతపై నియంత్రణ ఉండాలి. విత్తన, పురుగు మందుల నాణ్యత పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో కమిటీలు ఉండాలి.

12. విత్తన లోపంతో పంట నష్టం జరిగితే విత్తన కంపెనీల నుండి వెంటనే నష్టపరిహారం, కంపెనీల యాజమాన్యంపై దగా, మోసం కేసులను నమోదు చేసి కఠినంగా శిక్షించాలి.

13. ప్రతి రెండువేల ఐదువందల హెక్టార్లకు ఒక్క వ్యవసాయ విస్తరణ అధికారి రైతులకు అందుబాటులో ఉండి సాంకేతిక సహకారం అందించాలి.

14. వ్యవసాయ పరిశోధన కేంద్రాలకు నిధుల కొరత లేకుండా చేసి, అధిక ఉత్పత్తి సాధించడానికి, కొత్తరకం వంగడాలు మరియు సాంకేతిక పరిజ్ఞానం రూపొందించేలా చూడాలి.

15. ప్రతి సంవత్సరం రైతు, రైతు కూలీల ఆర్థిక సామాజిక జీవనంపై పరిశోధనలు చేసి ప్రత్యేక నివేదికను రూపొందించి వారి జీవన ప్రమాణాలు పెంపొందడానికి చర్యలు తీసుకోవాలి.

16. రైతులు అసంఘటితంగా ఉండి, ఎవరి పద్ధతిలో వారు వ్యవసాయం చేసుకోవడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నారు. గిట్టుబాటు ధర లేక వ్యాపారుల దోపిడీకి గురవుతున్నారు. రైతుల ఆదాయ భద్రత కోసం, దోపిడీదారుల నుంచి రక్షణ కోసం వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడాలి.

17. మార్కెట్‌లో పంటలకు మద్దతు ధరలు కూడా అందుబాటులో లేనప్పుడు రైతులు నష్టపోకుండా ఉండటానికి ధరల స్థిరీకరణ నిధిని రూ. 1000 కోట్లతో ఏర్పాటు చేయాలి. ధరల స్థిరీకరణ కోసం ఎఫ్‌సీఐ, సీసీఐ, మార్క్‌ఫెడ్, ఆగ్రోస్ మొదలైన సంస్థలు రైతులను ఆదుకోవడానికి సిద్ధంగా ఉండాలి.

18. వ్యవసాయ మార్కెటింగ్ సంస్థని ప్రక్షాళన చేసి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కొనుగోళ్లు, చెల్లింపులు పారదర్శకంగా ఉండే విధంగా ఏర్పాటు జరగాలి.

19. వ్యవసాయాన్ని ఆధునీకరించే విధానంలో భాగంగా సన్నకారు చిన్నకారు రైతులకు అనుకూలమైన ట్రాక్టర్లు, అనుబంధ పరికారలు 90శాతం సబ్సిడీతో అందించాలి.

20. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రైతులకు పూర్తిస్థాయిలో అనుసంధానం చేసి పెట్టుబడి ఖర్చులు తగ్గే విధంగా చూడాలి.

21. రైతు కుటుంబాల నుంచి చదువుకున్న యువతీయువకులకు వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, గ్రేడింగ్, ప్యాకింగ్, నిల్వ చేసుకోవడం, మార్కెటింగ్, ప్రాసెసింగ్ మొదలైన అంశాలలో శిక్షణనివ్వాలి.

22. పండ్ల తోటలు, పూల తోటలు, కూరగాయల వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం, బిందు సేద్యం, తుంపర్ల సేద్యం, షేడ్ నెట్స్ మొదలైన వాటిల్లో శిక్షణనందించి రైతులకు సబ్సిడీ అందించాలి.

23. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, కోల్డు స్టోరేజీలు, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం గోడౌన్లు స్థాపించే విధంగా విధానాలు రూపొందించి ప్రోత్సహించాలి.

24. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను స్వయంగా ఎక్కడైనా అమ్ముకునే విధానం మరియు ఎగుమతులకు అనుకూలమైన విధానాలు రూపొందించాలి.

25. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలైన కోళ్లు, చేపలు, రొయ్యలు, పాడి, గొర్రెలు, మేకలు మొదలైన వాటిని యువత ఉపాధికి అనుకూలమైన విధానాలు రూపొందించాలి.

## సుపరిపాలన – అభివృద్ధి – లోక్‌సత్తా సూచనలు

1) కొత్త జిల్లాలతో అవినీతి లేని, పారదర్శక పాలనను ప్రజలకు అందించాలి.

2) సిటిజన్ ఛార్టర్ల అమలుతో పాటు హక్కుగా పౌరసేవలను అందించే చట్టం తేవాలి.

3) అవినీతి ఎక్కువగా ఉన్న ప్రభుత్వ శాఖలలో అవినీతి జలగలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి.

4) కేజీ టూ పీజీ విద్యను వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించాలి.

5) ప్రజారోగ్యం విషయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలి. జిల్లా ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులుగా తీర్చిదిద్దాలి.

6) ఆరోగ్యశ్రీని డెంగ్యూ, మలేరియా సహా అన్ని జబ్బులకూ అందరికీ వర్తింప చేయాలి.

7) పౌరసరఫరా వ్యవస్థను సమూలంగా సంస్కరించాలి. లీకేజీలను అరికట్టాలి.

8) అర్హులైన ప్రతి వ్యక్తికీ సంక్షేమ పథకాలు అందాలి.

9) సాగునీటి, తాగునీటి ప్రాజెక్టుల డీపీఆర్‌లను బహిరంగ పర్చాలి.

10) పెద్ద ప్రాజెక్టులలో అవినీతిరహిత పారదర్శక టెండర్లను ఆహ్వానించాలి.

11) రైతు రుణమాఫీని పూర్తిగా చేయాలి. ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అందించాలి. పరపతి సౌకర్యం పెంచాలి. మార్కెట్‌ల ఆధునీకరణ ద్వారా లాభసాటి ధరలు అందేలా చూడాలి.

12) భూ సేకరణ విధానాన్ని సమగ్రంగా సమీక్షించాలి. మార్కెట్ విలువ ప్రకారం 2013 చట్టం ప్రకారం గ్రామాలలో నాలుగు రెట్లు, పట్నాల్లో రెండు రెట్లు పరిహారం ఇవ్వాలి.

13) కార్పొరేట్ విద్యాసంస్థలపై ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి. ❍

## గ్రామజ్యోతిని వెలిగించండి, ఉచిత వైద్యం అందించండి



**ఖ**మ్మం జిల్లాలో బడుగు బలహీన వర్గాల ప్రజలు సరైన వైద్యం లేక బలవుతున్నారని, ఈ పాపం ప్రభుత్వానిదేనని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు కొర్లకంటి బాలస్వామి అన్నారు. బోనకల్లు మండలంలో జ్వరాలతో బాధపడుతున్న ఆళ్లపాడు గ్రామాన్ని సందర్శించి బాధితుల్ని పరామర్శించారు. ప్రభుత్వం గ్రామజ్యోతి అని ఏదో వికేంద్రీకరణ చేస్తున్నట్టు అట్టహాసం చేసిందని, చివరకు పారిశుద్ధ్యానికి నిధుల్లేక జ్వరాలు ప్రబలుతున్నాయని ధ్వజమెత్తారు. స్వచ్ఛ తెలంగాణ మచ్చుకైనా లేక కొత్తగూడెం మండలం చుంచు తండా, బాలాజీ తండా, కొణిజర్ల మండలం సింగరాయిపాలెం, తుమ్మలపల్లి గ్రామాల్లో డెంగీ, ఇతర విష జ్వరాలతో జనం బాధపడుతున్నారన్నారు.

కొణిజర్ల మండలంలోని తనికెళ్ల పంచాయతీలో బినామీ సర్పంచ్ (మహిళా సర్పంచ్ భర్త) తీరు వల్ల ఏర్పడుతున్న ఇబ్బందులను బాలస్వామి డీపీఓ, జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లారు. తనికెళ్లలో లోక్‌సత్తా పార్టీ మండల కమిటీ సమావేశం కంచర్ల రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఆరువేల జనాభా కలిగిన ఈ గ్రామంలో మూడు దళితవాడలున్నాయని, ఏటా వర్షాకాలంలో పెచ్చరిల్లే వ్యాధులకు ఈ కాలనీల్లోని ప్రజలు పది లక్షల రూపాయల వరకూ వైద్యానికి ఖర్చు చేస్తారని ఈ సందర్భంగా పార్టీ నేతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రభుత్వం పారిశుద్ధ్యాన్ని, ఆరోగ్యాన్ని కనీసం పట్టించుకోవటం లేదన్నారు. పేదలకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలకన్నా వైద్యానికి వారు వదిలించుకుంటున్న డబ్బు చాలా ఎక్కువగా ఉందన్నారు. మరుగుదొడ్ల లబ్ధిదారులకు వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనిచ్చేలా గ్రామజ్యోతిని అమలుచేయటంతోపాటు లోక్‌సత్తా ప్రతిపాదించినట్టు అందరికీ నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందించాలని బాలస్వామి, ఇతర నేతలు డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ వెంకట్రావు, జానీ మియా, అప్పారావు, కృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు. ❍

# గూండాలు, నేరగాళ్లు రాజకీయాల్లోకి వస్తే సమాజ పతనం ఖాయం, జిల్లాకో ఫోరెన్సిక్ ల్యాబ్ ఏర్పాటు చేయాలి: జేపీ






తగినన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌లు లేకపోవటం వల్ల న్యాయస్థానాల్లో కేసుల విచారణ ఆలస్యం అవుతోందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. దేశంలో రోజూ వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వాలు కేవలం రూ. 1500కోట్లు వెచ్చిస్తే జిల్లాకో ఫోరెన్సిక్ ల్యాబ్ అందుబాటులోకి వస్తుందని అన్నారు. డీఎన్ఏ రిపోర్టు ఇవ్వడానికి ఏడాది పట్టటం దారుణమన్నారు. అద్భుత పనితీరు కనబరిచినవారిని కొన్ని నెలల్లో పనికిమాలినవారుగా తయారుచేసే శక్తి మన ప్రభుత్వాలకు ఉందన్నారు.

ట్రూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని ట్రూత్ ల్యాబ్స్ తొమ్మిదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ 'ఆస్కీ'లో 'సొసైటీ, ట్రూత్ అండ్ జస్టిస్'పై సమావేశం నిర్వహించారు. ఫౌండేషన్ ఛైర్మన్ డా॥ గాంధీ పీసీ కాజా కార్యక్రమానికి నేతృత్వం వహించారు.

ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ.. సాధారణంగా మనిషి నేరం చేసేందుకు భయపడతాడని, అది చట్టం వల్ల కాకుండా ఎదుటివారు ఏమనుకుంటారోనన్న భావనతోనేనని అన్నారు. కోర్టులో అబద్ధమాడటమే లక్ష్యంగా పెట్టుకున్న సమాజం మనదని, ఇక న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఆత్మవిమర్శ అవసరమన్నారు. పెరుగుతున్న నేరాల నేపథ్యంలో న్యాయవాదుల సంఖ్య కూడా పెరగాలన్నారు. ట్రూత్ ఫోరెన్సిక్ ల్యాబ్స్ ఎన్నో కేసులను పరిష్కరించిందని ప్రశంసించారు. సుహృద్భావ వాతావరణానికి అందరూ కృషి చేయాలని, గూండాలు, నేరగాళ్లు రాజకీయాల్లోకి వస్తే సమాజం దిగజారిపోవడం ఖాయమని అన్నారు.

ఫోరెన్సిక్ ప్రయోగశాలలు ప్రభుత్వాల అధీనంలో కాకుండా స్వతంత్ర ప్రతిపత్తి కలిగివుండాల్సిన అవసరముందని ఐపీఎస్ మాజీ అధికారి ఆంజనేయరెడ్డి అన్నారు. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి బోర్డు ఛైర్మన్ జస్టిస్ జి. భవానీప్రసాద్ మాట్లాడుతూ, న్యాయమూర్తుల నియామకాలు చేపట్టటం లేదని, కోర్టులతోపాటు న్యాయమూర్తుల సంఖ్యనూ పెంచాలన్నారు. న్యాయమూర్తులకు ఫోరెన్సిక్ సైన్స్‌పై అవగాహన ఉండటం కూడా అవసరమన్నారు.

గాంధీ పీసీ ఖాజా మాట్లాడుతూ, 2007లో ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని, దేశంలో ఇదే మొదటి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ అని తెలిపారు. కోర్టులు, పోలీసులు కూడా ఎవిడెన్స్ కోసం తమ ల్యాబ్‌పై ఆధారపడటం, సుప్రీంకోర్టు కూడా నమ్మకాన్ని ప్రదర్శించటం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో తమిళనాడు మాజీ గవర్నర్ పీఎస్ రామ్మోహనరావు, ట్రూత్ ఫౌండేషన్ డైరెక్టర్లు జోసెఫ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ❍

# బీసీల ఆరోగ్యం గురించి ఇకనైనా మాట్లాడతారా!



పేద, అణగారిన ఎస్సీ,ఎస్టీ,బీసీ-ఎంబీసీ వర్గాల అభివృద్ధికి లోక్‌సత్తా ఎజెండాను మించింది లేదని తరచూ చెబుతున్నా వివిధ తాత్కాలిక కారణాల రీత్యానేమో ఆ సంఘాల నాయకుల్లో పలువురు పెద్దగా స్పందించరు. సమాజంలో పైస్థాయిలో ఉండే 10-20శాతం మంది వాళ్ల జీవితాల్ని వాళ్లు చూసుకోగలరని, కానీ ఎస్సీ, ఎస్టీ, బీసీలు, అగ్రకులాల పేదలు తమ జీవితాల్ని బాగుచేసుకోవడానికి కావలసిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల్ని, పాలనలో భాగస్వామ్యాన్ని అందించేది లోక్‌సత్తా ఎజెండా మాత్రమేనన్న మాటల్ని విననట్టే వ్యవహరిస్తుంటారు. 2009 ఎన్నికల్లో ప్రజాస్వామ్యయుతంగా లోక్‌సత్తా చేసిన టికెట్ల కేటాయింపు వల్ల ప్రతి ముగ్గురు అభ్యర్థుల్లో ఒకరు బీసీ. అలాగే జనరల్ సీట్లలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల్ని పార్టీ నిలబెట్టింది. వ్యవస్థాపక అధ్యక్షుడు జేపీ స్వచ్ఛందంగా రెండోసారి పోటీ నుంచి విరమించుకున్నాక ఎన్నికైన అధ్యక్షులు, ఆ తర్వాత తెలంగాణ, ఏపీకి ఎన్నికైన అధ్యక్షులు కూడా బీసీలే. రాజకీయ సంస్కృతి పరంగా, ఎజెండా పరంగా అసలైన సామాజిక న్యాయాన్ని అందించేది లోక్‌సత్తా మాత్రమేనని కాస్త సాక్ష్యాధారాలతో మాట్లాడే ఎవరికైనా అర్థమవుతుంది. తాజాగా తెలంగాణ ఆరోగ్యశ్రీ వివరాలను చూస్తే, లోక్‌సత్తా వాదన ఎంత వాస్తవమో అర్థమవుతుంది. వ్యాధి నిరోధానికి, ప్రాథమిక చికిత్సకు, తొలిదశ వైద్యానికి డబ్బు లేక చివరిదశలో ఆరోగ్యశ్రీ ఆపరేషన్లు చేయించుకుంటూ ప్రభుత్వ ఓటుబ్యాంకు వైద్య విధానానికి మూల్యం చెల్లిస్తూ అరకొర జీవితం గడుపుతున్న రోగుల్లో ఎక్కువ శాతం బీసీలేనని తేలింది. 2015-16లో తెలంగాణలో ఆరోగ్యశ్రీ ద్వారా మొత్తం 2,60,110 చికిత్సలు చేస్తే అందులో 1,40,098మంది బీసీలే.

వాస్తవానికి ఇందులో కొత్తగా కనిపెట్టాల్సిందేమీ లేదు. రాష్ట్ర జనాభాలో అత్యధికులు బీసీలైనప్పుడు, ఆరోగ్యరంగంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎక్కువగా నష్టపోతున్నది వారే అవుతారు. బీసీల అభ్యున్నతి గురించి మాట్లాడుతున్నామంటూ నాయకులుగా చెలామణి అవుతున్న వారు కుల రాజకీయాలు చేస్తున్నారు తప్ప.. బీసీల జీవితాల్ని పేదరికంలోకి నెడుతున్న ఆరోగ్య సంక్షోభం గురించి ఎందుకు మాట్లాడటం లేదన్నదే మనం ఇప్పుడు కొత్తగా ప్రశ్నించాల్సింది.. అందుకోసం ఆరోగ్యశ్రీ అంకెల్ని కేవలం ఒక ఉదాహరణగా మాత్రమే వినియోగించుకుంటున్నాం.

జాతీయ నమూనా తాజా సర్వే ప్రకారం, ప్రభుత్వ వైద్యం తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో 19 శాతం ఉండగా, పట్టణ ప్రాంతాల్లో తొమ్మిది శాతం మాత్రమే ఉంది. ప్రయివేటు వైద్యసేవలు అత్యధికంగా ఉంటూ ప్రభుత్వ వైద్యసేవల పాత్ర నామమాత్రంగా మారుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, పంజాబ్, ఉత్తరప్రదేశ్ ముందు స్థానాల్లో ఉన్నాయి. 1995-96లో ప్రభుత్వ వైద్యం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతంలో 22శాతం ఉండగా 2014నాటికి 16శాతానికి పరిమితమైంది. 2015-16 ఆరోగ్యశ్రీ చికిత్సల్లో ప్రభుత్వాసుపత్రుల్లో 76,166 జరగగా, ప్రైవేటు, కార్పొరేటు ఆసుపత్రుల్లో 1,83,944 జరిగాయి. ఈ ప్రకారం సర్కారు నుంచి ప్రభుత్వాసుపత్రులకు కేవలం రూ.188.97 కోట్లు కేటాయించగా, ప్రైవేటు ఆసుపత్రులకు రూ.494కోట్లు కేటాయించారు. పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యం పదేళ్లలో 20శాతం నుంచి 12శాతానికి తగ్గింది. కుటుంబ పోషణ, సాధారణ ఆర్థిక వ్యవహారాల్లో తలమునకలై ఎక్కువమంది తమ ఆరోగ్యాన్ని విస్మరిస్తూ సాంక్రామికేతర

వ్యాధుల బారిన పడుతున్నారు. తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో వైద్య ఖర్చు రూ.21683కాగా, పట్టణాల్లో రూ.22584 ఖర్చవుతోంది. వైద్యం కోసం సగం మంది అప్పులు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాల్లో ప్రతి వెయ్యిమందిలో 505 మంది అప్పుల ద్వారా వైద్యానికి కావలసిన డబ్బుని సమకూర్చుకుంటున్నారు. వీరిలో బంధుమిత్రుల నుంచి 40మంది అప్పులు తీసుకుంటుండగా, 5గురు ఆస్తులు అమ్ముకుంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో అప్పులు చేసేవారి సంఖ్య వెయ్యికి 236గా ఉంది. వీరిలో బంధుమిత్రుల నుంచి అప్పులు తీసుకుంటున్నవారు 33మందికాగా, ఆస్తులు అమ్ముకుంటున్నవారు 4గురు ఉన్నారు. అస్వస్థతకు గురవుతున్నవారు ప్రతి వెయ్యిమందిలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో 67మంది ఉండగా, పట్టణ ప్రాంతాల్లో ఆ సంఖ్య 95గా ఉంది. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో కూడా మహిళలు పురుషుల కంటే ఎక్కువ అస్వస్థతకు గురవుతున్నారు. ప్రయివేటు వైద్యంపై గ్రామాల్లో 72శాతం, పట్టణ ప్రాంతాల్లో 79శాతం ఆధారపడుతున్నారు.

తెలంగాణలో మూడున్నరకోట్ల మంది జనాభా ఉంటే వారిలో అత్యధికులు కులం పరంగానో, ఇతరత్రా కారణాలరీత్యానో బీసీలు.. వీరిలో కుల స్పృహ బలంగా ఉన్నా కూడా వెనకబాటుతనం వీరందరినీ కలిపే ఉమ్మడి బంధం. మరి తెలంగాణ ఆరోగ్య రంగంలోని ఈ గణాంకాలన్నీ అంతమంది బీసీల జీవితాల్నీ కుదిపేసేవేగా! ఆర్థికంగా, శారీరకంగా వారిని కుంగదీస్తూ మరింత పేదరికంలోకి నెడుతున్నవేగా!! జబ్బు ముదిరాక ఆరోగ్యశ్రీ సేవలు లభించాయనుకున్నా, ఆ చికిత్స అనంతరం కోలుకుని తిరిగి పనిచేసే అవకాశాలు బలహీనపడతాయనటంలో సందేహం లేదు. జబ్బు నివారణకు, ప్రాథమిక, రెండో దశ వైద్యానికి, అన్ని జబ్బులకు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులో ఉంటే.. అనేకమంది బీసీలకు పనిచేసే, సంపాదనను పెంచుకునే సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది, ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాకుండా జేబులో నుంచి చేస్తున్న వేల కోట్ల ఖర్చు లేకుండా పోతుంది.

ఇలా ప్రభుత్వ పర్యవేక్షణలో ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతో 'అందరికీ వైద్యాన్ని' తక్కువ ఖర్చుతో అందించే విధానాన్ని లోక్‌సత్తా రూపొందించి ఇప్పటికే పాలకులకు అందించింది. దీనికితోడు బీసీలకు విద్య, ఉపాధి అవకాశాల మీద దృష్టిపెడితే వారు ఇక ఎవరి ముందైనా తలెత్తుకుని జీవించగలుగుతారు. బీసీల అభ్యున్నతికి పునాదిలాంటి సరైన ఆరోగ్యం, చదువు అందించకుండా వాళ్ల జీవితాల్ని ఎలా బాగుచేస్తారో బీసీ నాయకులమని చెప్పుకుంటున్నవారిలో ఒక్కరైనా చెప్పగలరా? తెలంగాణలోనే కాదు, ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాలలోనూ, బీసీలేకాదు, ఎస్సీ, ఎస్టీలు, అగ్రకులాలుగా పిలవబడుతున్న వారిలోని పేదలు.. అందరూ ఆలోచించి కార్యాచరణను మార్చుకోవాలని చెప్పే వాస్తవాలివి. ❍

# రక్షణ గోడలు నిర్మించాలి

మిర్యాలగూడ పట్టణ రహదారుల వెంట విస్తరించి ఉన్న విద్యుత్తు నియంత్రికలకు రక్షణ గోడలు నిర్మించాలని లోక్‌సత్తా పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు వీరప్రతాప్ కోరారు. సీతారాంపురం కాలనీలో ప్రమాదకరంగా వున్న నియంత్రికలను నాయకులతో కలిసి పరిశీలించారు. వీటి వద్ద తరచూ మంటలు వస్తున్నాయని, పెద్దశబ్దంతో ఫ్యూజులు పోతున్నాయని ఆయన అన్నారు. వీటితోపాటు పలు వీధుల్లో ప్రమాదకరంగా వేలాడుతూ వున్న విద్యుత్తు తీగలను సరిచేయాలని అధికారులు, నేతలకు విజ్ఞప్తి చేశారు. సుబ్రమణ్యం, సైదులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ❍



# ఆయురారోగ్యఐశ్వర్యాలను అందించే పార్టీ లోక్‌సత్తాయే: కల్లూరి



ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో తలెత్తుకుని బతికే జీవితాన్నందించే ఎజెండా, రాజకీయ సంస్కృతితో పనిచేస్తున్నది లోక్‌సత్తా మాత్రమేనని పార్టీ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన కల్లూరి బాలసుబ్రమణ్యం అన్నారు. పార్టీ నేతలతో కలిసి తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన సమయంలో తెలుగువారి ప్రయోజనాల కోసం చట్టసభలో మాట్లాడింది, గల్లీ నుంచి ఢిల్లీ వరకూ పోరాడింది లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీయేనన్నారు. ఎందరో నాయకుల్ని, ముఖ్యమంత్రుల్ని అందించినా వెనకబడిన రాయలసీమకు ప్రత్యేక హోదా రాయితీలు ఇవ్వాలన్నది జేపీ మాత్రమేనన్నారు. కులం, మతం, ప్రాంతం, భాష వంటి వివక్షలకు అతీతంగా ప్రజాస్వామ్యయుతంగా లోక్‌సత్తా పనిచేయబట్టే అణగారిన, వెనకబడిన వర్గాలవారు అనేకమంది పార్టీలో ఉన్నత పదవుల్ని పొందగలిగారన్నారు. ప్రజాప్రయోజనాల కోసం ఏ పార్టీ చేయనంత సాహసోపేతంగా, సృజనాత్మకంగా లోక్‌సత్తా కొత్త రాజకీయం చేస్తోందన్నారు. దేశం కోసం పార్టీలకతీతంగా వ్యవహరించగల శక్తి లోక్‌సత్తాకు మాత్రమే ఉందన్నారు.

లోక్‌సత్తా పార్టీని స్థాపించినప్పటి నుంచి వివిధ హోదాల్లో అంకితభావంతో పనిచేస్తున్నానన్నారు. గత ఏడాది ఉప ఎన్నికల్లో తిరుపతి శాసనసభ్యునిగా పోటీ చేశానని బాలసుబ్రమణ్యం తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఉన్న తనని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేశారన్నారు. దీంతో తన మీద బాధ్యత మరింత పెరిగిందన్నారు. లోక్‌సత్తా లక్ష్యాల కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. లోక్‌సత్తా ఏపీ నూతన అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, స్టీరింగ్ కమిటీలోని ఇతర సభ్యులందరితో కలిసి కార్యాచరణను ఖరారు చేస్తామని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రిజర్వేషన్లు, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఎన్నికల సంస్కరణలు తదితర అంశాలు ఎజెండాలో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు బెల్లంకొండ సురేష్, సత్యనారాయణ, మదన్‌మోహన్ రెడ్డి, రాఘవ రెడ్డి, మునిచంద్ర తదితర నేతలు పాల్గొన్నారు. ❍

# స్థానిక ప్రభుత్వాల కోసం పార్టీలకతీతంగా పోరాడతాం

స్థానిక సంస్థల బలోపేతానికి పార్టీలకతీతంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడతామని పంచాయతీరాజ్ ఛాంబర్ జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యలమంచిలి బాబూరాజేంద్రప్రసాద్ అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కమిటీల సమావేశాలు షాద్‌నగర్‌లో జరిగాయి. ఛాంబర్ ఆంధ్రప్రదేశ్ విభాగ అధ్యక్షుడిగా వున్న రాజేంద్రప్రసాద్‌ను.. ఈ సందర్భంగా ఉభయ రాష్ట్రాల ప్రతినిధులు జాతీయ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సంస్థలకు నిధులు, విధులు, అధికారాలను బదిలీ చేసి వాటిని బలోపేతం చేసేందుకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సహకరించాలని రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. 73,74 రాజ్యాంగ సవరణల్ని తక్షణమే అమలుచేయాలన్నారు. 29 అంశాలను గ్రామ పంచాయతీలకు, మండల పరిషత్‌లకు, జిల్లా పరిషత్‌లకు బదిలీ చేయాలన్నారు. ఏపీ స్థానిక సంస్థలకు రూ.15వేల కోట్లు, తెలంగాణ స్థానిక సంస్థలకు రూ.9వేల కోట్లు విడుదల చేయాలన్నారు. స్థానిక సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా మార్చు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడు అందె బాబయ్య, ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ, ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ. కృష్ణమూర్తి, ఏపీ ఎంపీపీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి ప్రసాద్, తెలంగాణ సర్పంచుల సంఘం కన్వీనర్ పురుషోత్తం రెడ్డి, ఇరు రాష్ట్రాల నాయకులు పాల్గొన్నారు. ❍

# భవిష్యత్తు లోక్‌సత్తాదే: భీశెట్టి



సమాజంలో పేద, అణగారిన, మధ్యతరగతి వర్గాల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన విధానాలు, నాగరిక ప్రజాస్వామిక రాజకీయ సంస్కృతితో కృషి చేస్తున్న ఏకైక పార్టీ లోక్‌సత్తా అని పార్టీ ఆంధ్రప్రదేశ్ నూతన అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. భవిష్యత్తు లోక్‌సత్తాదేనన్నారు. లోక్‌సత్తా పార్టీ, జేపీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయనన్నారు.

లోక్‌సత్తా పార్టీ ఏపీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక తనను అభినందించేందుకు వచ్చిన కార్యకర్తలు, నేతలతో విజయనగరంలో బాబ్జీ మాట్లాడారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, లోక్‌సత్తా భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాల్ని ప్రస్తావించారు.

బాబ్జీ మాట్లాడుతూ.. ఓట్లు, సీట్లు పొందిన పార్టీలకన్నా ప్రజలలో లోక్‌సత్తా భావాలకు ఎక్కువ ఆదరణ ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో తామే సార్వభౌములం, తమ ఓటుతో రాజకీయాల్ని మార్చవచ్చన్న విశ్వాసం ప్రజలలో కలిగిన రోజున ఇప్పుడు పెత్తనం చెలాయిస్తున్న సాంప్రదాయ రాజకీయపార్టీల అడ్రస్‌లు గల్లంతవుతాయన్నారు. కేవలం ప్రజలిచ్చిన కొద్దిపాటి నిజాయతీ డబ్బుతో, విధానాల బలంతోనే లోక్‌సత్తా గణనీయ ప్రభావం చూపగలుగుతోందని, ప్రజలంతా కలిసివస్తే గొప్ప మార్పును ఆచరణలో చూపగలమని అన్నారు. ముఖ్యంగా యువత లోక్‌సత్తా వేదికగా మార్పును సాధించేందుకు ముందుకు రావాలన్నారు. తాము ఉంటున్న ప్రాంతాలలోనే అవినీతి లేకుండా చేసేందుకు, మౌలిక వసతుల్ని పెంచేందుకు, ప్రజల జీవితాల్ని మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానంతో తమ చదువుల్ని, కెరీర్‌లను చూసుకుంటూనే తేలిగ్గా ఇలాంటి పనుల్ని చేయవచ్చన్నారు. ఇందుకు కావలసిన ప్రాథమిక శిక్షణను లోక్‌సత్తా అందిస్తుందన్నారు.

బాబ్జీ ఇంకా ఇలా అన్నారు:

■ సాధ్యమైనంతమేర కొత్తతరం వారిని పార్టీలో చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎంతమంది యువత లోక్‌సత్తా భావాలను అందుకుంటే అంతమేర ఈ దేశానికి మేలు చేకూరుతుంది.

■ రాష్ట్ర విభజన సమయంలో హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోతే ఆంధ్రప్రదేశ్‌కు జరిగే నష్టాన్ని పూడ్చటానికి 'ప్రత్యేక హోదా' ప్రతిపాదన చేసింది లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణే. కేంద్రం ఇచ్చిన హామీల్ని అమలుచేయకపోతే 'తెలుగు భవిత' కార్యక్రమం ద్వారా పోరాటానికి శ్రీకారం చుట్టింది లోక్‌సత్తాయే.

■ విభజనకు ముందు, ఎన్నికల తర్వాత కూడా రాష్ట్రానికి కావలసిన ప్రయోజనాల్ని సాధించటానికి రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలు చేస్తున్నదేమీ లేదు.

■ ప్రజలు తమ జీవితాల్ని బాగు చేసుకోవటానికి, ఆదాయాల్ని పెంచుకోవటానికి, బిడ్డలకు మంచి భవిష్యత్తును అందించటానికి కీలకమైన ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలలో ఆంధ్రప్రదేశ్ అధ్వాన్న స్థితిలో ఉంది. నడిరోడ్డు మీద గిరిజన బిడ్డలు ప్రసవిస్తున్నారు. చాలా స్కూళ్లలో పిల్లలు చిన్నచిన్న లెక్కలు కూడా చేయలేకపోతున్నారు. సమస్యల్ని పరిష్కరించే శక్తి ఉండటం లేదు.

■ అంతా అమరావతి చుట్టూ కేంద్రీకరించి ఆర్భాటాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాలక్షేపం చేస్తున్నారు. మద్యాన్ని ఆదాయమార్గంగా చేసి పేద, మధ్యతరగతి జీవితాల్ని ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నాశనం చేస్తున్నారు.

■ ముఖ్యమంత్రికి సంబంధంలేని పుష్కరాల నిర్వహణ వంటి కార్యక్రమాలతో ప్రజల దృష్టిని మళ్లిస్తూ చంద్రబాబు ఈవెంట్ మేనేజర్‌లా వ్యవహరిస్తున్నారు.

■ ఈ ఆడంబరాలు, కేంద్రీకృత పాలన, తాయిలాలు, మద్యం, కులం రాజకీయాన్ని మార్చి.. అందరికీ నాణ్యమైన చదువు, ఆరోగ్యం, ఉద్యోగాలు, తలెత్తుకుని బతికే జీవితాలు, అధికార వికేంద్రీకరణతో కూడిన లోక్‌సత్తా ప్రత్యామ్నాయ రాజకీయాన్ని గెలిపించాల్సిన అవసరం ఎంతుందో ప్రజలకు వివరిస్తాం.

■ ప్రత్యేక హోదా పన్ను రాయితీలు, పోలవరం వేగంగా పూర్తి చేయటం, రిజర్వేషన్లు, ఎన్నికల సంస్కరణలు, స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు తదితర అంశాలపై కూడా కార్యాచరణ రూపొందిస్తాం.

■ త్వరలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి బాలసుబ్రమణ్యం, ఇతర స్టీరింగ్ కమిటీ సభ్యులతో సమావేశమై ఈ అంశాలన్నిటినీ చర్చించి ఏకాభిప్రాయంతో కార్యాచరణ ప్రారంభిస్తాం. ❍

## మాలమహానాడు అభినందనలు



విజయనగరం జిల్లా నుంచి వెనకబడిన కులానికి చెందిన వ్యక్తిని పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవిలో నియమించటం మంచి పరిణామమని, సామాజిక న్యాయాన్ని లోక్‌సత్తా ఆచరణలో చూపటాన్ని హర్షిస్తున్నామని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి లోగిశ రామకృష్ణ అన్నారు. భీశెట్టిని కలిసి అభినందించారు. మాలమహానాడు జిల్లా కార్యదర్శి పనస బంగార్రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాకా ప్రమీలరాణి, బని రాజారావు, దుక్క శివాజీ, రవికిరణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వ్యాపారుల సమస్యలపై గొంతు విప్పండి



రాష్ట్రవ్యాప్తంగా వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలపై గళం విప్పాలని పెట్రోల్, డీజిల్ బంకుల జిల్లా అధ్యక్షుడు, ప్రముఖ వ్యాపారి, వయోవృద్ధుల సంఘం ప్రతినిధి ఆరిశెట్టి గున్నయ్య గుప్తా భీశెట్టిని కోరారు. బాబ్జీ నాయకత్వంలో లోక్‌సత్తా పార్టీ అభివృద్ధి చెందాలని శుభాకాంక్షలు తెలియచేశారు.

## మూతపడిన పరిశ్రమలను తెరిపించండి

చైనా వస్తువుల్ని కొనవద్దని పిలుపునిస్తున్న కేంద్రప్రభుత్వం అంతకంటే ముందు మనదేశంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల్ని పెంచాలని బాబ్జీ అన్నారు. చైనా వస్తువుల చుట్టూ ఇంత గొడవ జరుగుతున్నా కేంద్రంలో మంత్రిపదవిలో ఉన్న అశోక్ గజపతి రాజుకి కనీసం జిల్లాలో, రాష్ట్రంలో పరిశ్రమల్ని కాపాడుకుందాం,పెంచుదాం అన్న యోచన లేకపోవటం దారుణమన్నారు. జిల్లాలో మూతపడ్డ పరిశ్రమలను తెరిపించకుండా, ఇక్కడ రోడ్లు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల్ని మెరుగుపరచకుండా జిల్లా ఉత్సవాలు వంటి కార్యక్రమాలతో మంత్రి కాలక్షేపం చేస్తున్నారన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థితిగతులపై కలెక్టర్‌ని కూడా కలిసి బాబ్జీ వివరించారు. పలు పరిశ్రమలు రెండేళ్లుగా మూతపడి వున్నా తెరిపించేందుకు అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు కూడా ప్రయత్నించటం లేదన్నారు. జూట్ పరిశ్రమలు మూతపడి వేలమంది కార్మికులు వీధినపడ్డారన్నారు. విచ్చలవిడి మద్యం పేదల జీవితాల్ని పీల్చేస్తోందన్నారు. జిల్లాలో చాలాచోట్ల సురక్షిత తాగునీరు కూడా అందుబాటులో లేదన్నారు. ఈ సమస్యలన్నిటినీ రాష్ట్ర ప్రభుత్వం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవ చూపాలని బాబ్జీ కోరారు.

# మోదీ చెప్పింది, తెలంగాణ ప్రభుత్వం అడిగింది రూ.3079, ఇప్పుడు ఇస్తామంటున్నది మాత్రం రూ.1,470

తాము అధికారంలోకి వస్తే రైతులకు పంట పండించటానికయ్యే ఖర్చుకు అదనంగా 50శాతం కలిపి స్వామినాథన్ కమిటీ సిఫార్సు చేసిన మేరకు మద్దతు ధర కల్పిస్తామని నరేంద్ర మోదీ 2014 ఎన్నికల సమయంలో చెప్పారు. ఈ లెక్కన 2016-17 ఖరీఫ్‌లో తెలంగాణలో సాధారణ రకం వరి క్వింటాలుకు రూ. 3,079 అయితే, 'ఏ' గ్రేడ్ ధాన్యానికి రూ. 3,941 అవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ తేల్చింది. వరికి ఈ మద్దతు ధరను ఇవ్వాలని చెబుతూ, అందుకు తగిన గణాంకాలను తెలంగాణ వ్యవసాయ శాఖ.. వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ సమావేశంలో కేంద్రానికి అందచేసింది. వరితో పాటు మొక్కజొన్న, సోయా, కంది, పెసర తదితరాలకయ్యే ఖర్చును కూడా నివేదికలో వివరించారు. అయితే చివరకు మోదీ ప్రభుత్వం మాట మార్చి వరి రకాలకు రూ. 1,470, రూ. 1510 మద్దతు ధర ప్రకటించింది. వ్యవసాయం లాభసాటి అనే మాటల్నే ఇప్పుడు కేంద్రం మాట్లాడటం లేదు. పాత ప్రభుత్వాల తరహాలో చిన్నచిన్న రాయితీలు, ద్రవ్యోల్బణంతో ఏమాత్రం పెరగని ఆదాయాల గురించే చెబుతున్నారు. చివరికి రైతులకు రుణసదుపాయాలకు బడ్జెట్ కేటాయింపులు కూడా తగ్గిపోయాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాల్లా రుణమాఫీలు వంటి అసంబద్ధ హామీల్ని కేంద్రం ఇవ్వకపోయినా.. వ్యవసాయాన్ని ప్రక్షాళన చేసే ఆలోచననే కేంద్రం చేయడం లేదు. అందరికీ వ్యాపారం గురించి లెక్చర్లిచ్చే ప్రధాని మోదీ.. రైతులను మాత్రం సెంటిమెంట్‌ల గొలుసుల మధ్యే కొనసాగించాలనుకుంటున్నారు. వ్యవసాయం సాంప్రదాయ వృత్తిలా తప్ప వ్యాపారం కాకుండా జాగ్రత్త పడుతున్నారు.

ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది ఖరీఫ్, రబీ లక్ష్యంగా సేకరించ తలపెట్టిన 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి కేంద్రం లెక్క ప్రకారమే, రూ. 1470, రూ. 1510 కనీస ధరగా నిర్ణయించింది. రాష్ట్రం తరపున ధర పెంపు, బోనస్‌లు వంటి వేమీ లేవు. ఏతావాతా వర్షాల వల్ల వచ్చిన నష్టం కంటే నేతల మోసం వల్లే మళ్లీ రైతులు నష్టపోయారు.

**మద్దతు ధరలపై తెలంగాణ రాష్ట్రం సిఫార్సు, కేంద్రం ఇచ్చింది (క్వింటాకు రూ.లు)**

| పంట | తెలంగాణ సిఫార్సు | కేంద్రం ప్రకటించింది |
|---|---|---|
| వరి | | |
| సాధారణ రకం | 3,079 | 1,470 |
| 'ఏ' గ్రేడ్ ధాన్యం | 3,941 | 1,510 |
| జొన్న | 3,433 | 1,625 |
| మొక్కజొన్న | 2,745 | 1,365 |
| కంది | 9,758 | 5,050 |
| మినుము | 8,797 | 5,225 |
| పెసర | 7,461 | 5,000 |
| వేరుసెనగ | 7,006 | 4,220 |
| సోయాచిక్కుడు | 4,591 | 2,775 |
| పొద్దుతిరుగుడు | 8,865 | 3,950 |
| నువ్వులు | 9,728 | 5,000 |
| పత్తి | 7,761 | 4,160 |

అరకొర ఆదాయంతోనే, పట్టణ ప్రాంతాల్లోని చప్రాసీ కంటే కూడా అనేక రెట్లు తక్కువ ఆదాయంతోనే మనుగడ సాగించాల్సిన పరిస్థితి రైతుకు తప్పటం లేదు.

తెలంగాణ వ్యవసాయ శాఖ కేంద్రానికి ఇచ్చిన పంట ఖర్చు లెక్క

వరిపంట సాధారణ రకం ధాన్యం పండిచడానికి హెక్టారుకు సగటున రూ. 65,811 ఖర్చవుతుంది. నేరుగా పెట్టే ఖర్చులుకాకుండా ఇతర ఖర్చులు కొన్నింటిని వరి ధాన్యం ఉత్పత్తికి పరిగణలోకి తీసుకున్నారు. అవి:

రైతు సొంత భూమిలో వరి సాగు చేస్తే ఆ భూమికి ఉన్న విలువ సొమ్ముపై వడ్డీ కింద రూ. 6581 వస్తుంది. ఇది కూడా ఖర్చులో భాగంగా పరిగణించాలి. రైతు కుటుంబ సభ్యుల కూలీ ఖర్చు రూ. 10వేలు, కౌలు వ్యయం రూ. 20 వేలు, పొలం నిర్వహణ ఖర్చు రూ. 10,239 ఇలా మొత్తం కలిపి ఖర్చు రూ. 1,12,631 అవుతుంది. వాతావరణం అనుకూలిస్తే.. హెక్టారుకు ఇప్పుడు 50 క్వింటాళ్ల సాధారణ వరి రకం ధాన్యం పండుతుంది. 40 క్వింటాళ్ల గడ్డి వస్తుంది. క్వింటా గడ్డి రూ. 250 చొప్పున రూ. 10,000 ఆదాయం వస్తుంది. దీన్ని ఖర్చు రూ. 1,12,631లో నుంచి తీసివేస్తే రైతుకు ఇంకా రూ. 1,02,631 ధాన్యం మీద రావాలి. దీని ప్రకారం సగటు ఉత్పత్తి వ్యయం రూ. 2053, స్వామినాథన్ కమిటీ సిఫార్సు ప్రకారం, క్వింటాలుకు రూ. 3079 అవుతుందని వ్యవసాయ శాఖ లెక్కచెప్పింది.

తాజాగా కేంద్రం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం లాభం మాట అలా వుంచి సాధారణ వరి రకంలో క్వింటాకు రూ. 583 నష్టం వస్తుంది. దీంతో మద్దతు ధర ప్రకటనను కూడా రాష్ట్రాల పరిధిలోకి తేవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఇక ఈ మద్దతు ధరను కూడా అందించకుండా దళారుల ద్వారా రైతులను దోచేస్తూ రసీదుల్లో మాత్రం మద్దతు ధరను చూపుతూ అధికారులు, రాజకీయ నేతలు ఎలా దోచేస్తున్నారో లోక్‌సత్తా గత ఏడాది రైతు సంఘాల నేతలతో కలిసి బైటపెట్టింది. ఒక్క ఏపీలోనే ఒక్క సీజన్‌లోనే పత్తి పంటలోనే ఇలా రూ. 1000 కోట్ల దాకా దోచేసినట్టు బైటపడింది. అయినా ఇప్పటివరకూ ఆ రైతుద్రోహులపై విచారణల పేరుతో కాలయాపన తప్ప సరైన చర్యలు లేవు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయటానికి మద్దతు ధర, అరకొర బీమా పథకాలు సరిపోవని, సమగ్ర సంస్కరణలతో వ్యవసాయాన్ని వ్యాపారంలా మార్చి రైతు ఆదాయాన్ని కేంద్ర బిందువు చేయాలని లోక్‌సత్తా డిమాండ్ చేయటంతోపాటు ఆచరణలో ఫలితాలు చూపినా ప్రభుత్వాలు ఇంకా వ్యవసాయం పట్ల మొక్కుబడిగానే వ్యవహరిస్తున్నాయి. ❍

# ఎత్తిపోతలొద్దు, బ్యారేజీలు మేలు

కేవలం 14 మీటర్ల ఎత్తుతో ఎల్లంపల్లికి 160 టీఎంసీల నీరు తరలించే అవకాశం ఉండగా కాళేశ్వరం నుంచి నీరు తరలించాలని చూస్తున్నారని, దీనివల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడుతుందని తెలంగాణ ఇంజినీర్ల ఫోరం అధ్యక్షుడు దొంతుల లక్ష్మీనారాయణ అన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లలో భారీ జలాశయాలు అవసరం లేదన్నారు. ఆదిలాబాద్‌లో ప్రవహించే కాలువల్లో బ్యారేజీలు కడితే దాదాపు రూ. 25వేలకోట్లు ఆదా అవుతాయన్నారు. ప్రభుత్వం ప్రాజెక్టు పునరాకృతి (రీడిజైనింగ్) పేరుతో ఇబ్బడిముబ్బడిగా నిధులు పెంచుతూ పోవటం శ్రేయస్కరం కాదన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లలో గోళాకారపు రిజర్వాయర్లను కట్టాలని యోచిస్తున్నారని, అవి ఎంతో ప్రమాదకరమని అన్నారు.

# రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి



విజయనగరం జిల్లాలో చీపురుపల్లి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా నియోజకవర్గ ఇంచార్జి రెడ్డి లక్ష్మునాయుడు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ తాడ్డి గోవిందరావుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా లక్ష్మునాయుడు మాట్లాడుతూ, ఇక్కడ రెవెన్యూ డివిజన్ ప్రజల ఆకాంక్షన్నారు. 1994లోనే డివిజన్ ఏర్పాటుకు సన్నాహాలు జరిగాయని, అప్పటి ఎమ్మెల్యే గద్దే బాబూరావు అందుకు కృషి చేశారని, ఆ తర్వాత అనేక పార్టీలు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చాయని అన్నారు. బొబ్బిలిలో డివిజన్ ఏర్పాటు చేస్తే చీపురుపల్లి ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడతారని, ఇక్కడే రెవెన్యూ డివిజన్ ఏర్పాటైతే సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యనారాయణ, ఆర్. దాలినాయుడు, ఎ. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ఖర్చు ఖర్చే.. ప్రణాళిక-ప్రణాళికేతర తేడా ఉండదు
# బడ్జెట్ 2017-18 నుంచి భారీ మార్పులు



ఎన్నో దశాబ్దాలుగా పాటిస్తూ వస్తున్న ప్రణాళిక-ప్రణాళికేతర వ్యయాల విధానానికి 2017-18 బడ్జెట్ నుంచి స్వస్తి చెప్పాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఖర్చు అంటే ఖర్చే.. అది ప్రణాళిక పద్దులోదా, ప్రణాళికేతర లెక్కలోదా అన్న భేదం ఉండదు. ఖర్చు పెట్టాల్సి ఉంటే, అది ఏదైనా తప్పదు, ప్రత్యేకించి తేడా ఎందుకు, పైగా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది అనే ఆలోచన నుంచి ఈ నిర్ణయం రూపుదిద్దుకుంది. ఒకరకంగా ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి నీతి ఆయోగ్ ఏర్పాటు వెనక ఆలోచన కూడా ఇదే. బడ్జెట్ అంటే కేవలం దిశానిర్దేశ పత్రమే తప్ప అందుకు ప్రత్యేకించి ప్రాధాన్యత లేదు, మనం మితిమీరి దానిపై చర్చలు చేస్తున్నాం అని కొందరు సాధికార మేధావులు చాలాకాలంగా చెబుతున్న విషయం కూడా ఇక్కడ గమనార్హం. ప్రభుత్వాలు కూడా పైకి గంభీరంగా బడ్జెట్ లెక్కలు, నిబంధనలు చెబుతున్నా తాము అవసరమని భావించనవాటికి నిధుల్ని మళ్లించటం ఆనవాయితీ అన్నట్టు ఇటీవల వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్‌ల తీరులో మార్పుల వల్ల పెద్ద కుదుపులేవీ ఉండవని భావిస్తున్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో పరిపాలనా వ్యయాలు, ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర తప్పనిసరి ఖర్చులు అన్నీ ప్రణాళికేతర వ్యయంగా పరిగణిస్తుంటారు. ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు, అవసరాల ఆధారంగా రూపొందించుకున్న అభివృద్ధి కార్యక్రమాలు వంటి వాటికి చేసే కేటాయింపులు ప్రణాళికా వ్యయం పరిధిలోకి వస్తాయి. ప్రణాళికా వ్యయం ప్రధానంగా ఆస్తుల కల్పనకు ఉద్దేశించినది. ఈ సంప్రదాయాలకనుగుణంగా ఇప్పటిదాకా ప్రణాళికలకు కేటాయింపులు చేస్తున్నారు. ఇకపై ఈ రకమైన వార్షిక బడ్జెట్‌లు ఉండవు. ప్రణాళికా సంఘం రద్దయింది కాబట్టి పంచవర్ష ప్రణాళికలు కూడా ఉండవు. ప్రభుత్వం తాను నిర్దేశించుకున్న ప్రాధమ్యాల ప్రకారమే నిధుల్ని కేటాయిస్తుంది.

కేంద్ర బడ్జెట్ రూపకల్పనలో ప్రతిపాదించిన మార్పుల ప్రభావం ఏమిటి? ఏ రకమైన మేలు జరుగుతుంది.. ఇబ్బందులేమైనా ఉంటాయా? అనేవి ఇప్పుడు ఆసక్తికరమైన అంశాలుగా మారాయి.

ప్రతి ఏటా ఫిబ్రవరి నెలాఖరులో కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టటం ఆనవాయితీగా వస్తోంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈసారి బడ్జెట్‌ను కొంత

ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ప్రణాళిక-ప్రణాళికేతర తేడా లేకుండా కేటాయింపులతోపాటు ఇప్పటికే రద్దు చేసిన రైల్వే బడ్జెట్‌ను కూడా కలిపి ఒకటే సాధారణ బడ్జెట్‌గా ప్రవేశపెడతారు.

## 'ముందస్తు' లాభనష్టాలు

ప్రస్తుత విధానంలో బడ్జెట్‌ను ఫిబ్రవరి నెలాఖరులో ప్రవేశపెట్టినప్పటికీ దానిపై ఉభయసభల్లో చర్చ జరిగి ఆమోదం పొందేసరికి మే నెల అవుతోంది. నూతన పన్ను ప్రతిపాదనలను అప్పటివరకూ అమలు చేయటం సాధ్యం కాదు. వాస్తవానికి పన్నుల్లో మార్పులు ఏవైనా ఉంటే.. అవి ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ఏప్రిల్ 1వ తేదీ నుంచే అమల్లోకి వస్తాయి. కానీ అప్పటికి బడ్జెట్‌కు పార్లమెంటు ఆమోదం లభించదు. అందువల్ల అమల్లో జాప్యం ఏర్పడుతోంది. ఇకపై అటువంటి ఇబ్బంది తలెత్తకపోవచ్చు. బడ్జెట్‌కు మార్చి నెలాఖరులోగా ఆమోదం లభిస్తుంది. ఇది ప్రభుత్వానికేకాకుండా వ్యాపార సంస్థలు, వ్యక్తులకు కూడా అనుకూలం. బడ్జెట్ ప్రతిపాదనలకు అనుగుణంగా తమ వ్యయాలు, పెట్టుబడులను ఖరారు చేసుకోవచ్చు. అంతేగాక పరోక్ష పన్నుల్లో మార్పుల్ని సైతం ఏప్రిల్ నుంచే అమల్లోకి తేవచ్చు. అయితే బడ్జెట్‌లను ముందుకు జరపటం వల్ల అంచనాలు సిద్ధమవటం, నిధుల కేటాయింపులో కొన్ని సమస్యలు తలెత్తవచ్చని కొందరి నుంచి వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఖర్చులు, కేటాయింపులు, ఆర్థికాభివృద్ధి అంచనాలు అప్పటికి సిద్ధంకావని, దీనివల్ల కొత్త బడ్జెట్‌లో కేటాయింపులు చేయటం, నిధుల లభ్యతపై ఒక అంచనా వేయటం కష్టసాధ్యమంటున్నారు. ఆర్థికలోటు లక్ష్యానికి కట్టుబడటం కుదరకపోవచ్చంటున్నారు.

ప్రతి బడ్జెట్‌లోనూ ప్రభుత్వం ఆర్థిక లోటు లక్ష్యాన్ని నిర్దేశించుకుంటుంది. దీనికి తగ్గట్టుగా ఆర్థిక సంవత్సరాంతంలో వివిధ శాఖలకు నిధుల విడుదలపై కోతలు విధిస్తుంది. సాధారణంగా ఇదంతా ఫిబ్రవరి-మార్చి నెలల్లో జరుగుతుంది. తద్వారా లోటు లక్ష్యాన్ని సాధించే ప్రయత్నం జరుగుతుంది. బడ్జెట్‌ను మరీ ముందుకు జరిపితే లోటు తీరుతెన్నులపై ప్రభుత్వం ఒక అవగాహనకు రాలేకపోవచ్చు. దీంతో లోటును కట్టడిచేయటం కూడా కష్టమవ్వచ్చని అంటున్నారు. ప్రభుత్వ వర్గాలు మాత్రం దీన్ని కాలక్రమంలో అధిగమించగలమని చెబుతున్నాయి.

## ఒకే గొడుగు కిందకు రైల్వే సంస్థలు

రైల్వే మంత్రిత్వశాఖ కింద రైల్వేలు కాకుండా స్వతంత్రంగా పనిచేసే 16 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నాయి. రైట్స్, ఇర్కాన్, కాన్కార్, రైల్‌టెల్, ఐఆర్‌సీటీసీ తదితర సంస్థలు ఇందులో ఉన్నాయి. ప్రస్తుత మార్పుల్లో భాగంగా వీటన్నింటినీ ఒక హోల్డింగ్ కంపెనీ కిందకు తీసుకొస్తారు. భవిష్యత్తులో ఈ కంపెనీల్లో ఈక్విటీ వాటాలు విక్రయించడం ద్వారా నిధులు సమీకరిస్తారు. వాటిని రైల్వేల అభివృద్ధికి వెచ్చించాలనేది ఆలోచన. ఇక రైలు ఛార్జీల పెంపు లేదా తగ్గింపు నిర్ణయాన్ని బడ్జెట్‌లో ప్రకటించాల్సిన అవసరం లేదు. ఎప్పటికప్పుడు విడిగానే అవసరాన్ని బట్టి ఛార్జీల పెంపుదల లేదా తగ్గింపు నిర్ణయాలు తీసుకోవచ్చు. ఛార్జీల పెంపుదల నిర్ణయాన్ని సమీక్షించి ఆమోదించేందుకు ఒక నియంత్రణ సంస్థ (టారిఫ్ రెగ్యులేటర్)ని ఏర్పాటు చేస్తారు.

## తెలంగాణ ఆర్థిక శాఖ కూడా కసరత్తు

దేశమంతటా ఒకే బడ్జెట్ విధానం ఉండాలన్న కేంద్ర మార్గదర్శకాల ప్రకారం తెలంగాణ ప్రభుత్వం కూడా ప్రణాళిక-ప్రణాళికేతర విభజన లేని బడ్జెట్‌ను ముందుగానే ప్రవేశపెట్టటానికి కసరత్తు ప్రారంభించింది. బడ్జెట్ మార్పులపై అధ్యయనం చేయడానికి ఆర్థికశాఖ కార్యదర్శి అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేశారు. ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి (బడ్జెట్), ప్రణాళిక శాఖ డైరెక్టర్, ఆర్థిక శాఖ ఐటీ విభాగ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. సూచించిన మార్పులివి:

- ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయం స్థానంలో రెవెన్యూ, క్యాపిటల్ అనే వర్గీకరణ ఉంటుంది. వీటి కింద తీసుకురావాల్సిన పద్దులను త్వరలోనే నిర్ణయిస్తారు.
- బడ్జెట్ రాత ప్రతి, సాఫ్ట్‌వేర్ మారతాయి
- శాఖల నుంచి ప్రతిపాదనలు తీసుకోవడానికి ప్రస్తుతమున్న నమూనాలు పూర్తిగా రద్దవుతాయి
- అవసరమైన చోట ఉపపద్దులను ప్రతిపాదిస్తారు
- ప్రస్తుతమున్న 'బడ్జెట్ హెడ్'లను కేంద్ర బడ్జెట్ హెడ్‌లకింద మారుస్తారు
- ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను ప్రత్యేకంగా చూపించటంపై ఏర్పాటుకు కసరత్తు చేస్తారు. అవసరమైతే చట్టసవరణ చేస్తారు. ❍


# 'స్టీల్ ఫ్లైవోవర్ బేడా'..
# బెంగళూరును కదిలించిన లోక్‌సత్తా పౌర ఉద్యమం




**బెం**గళూరులో బసవేశ్వర సర్కిల్ నుంచి హెబ్బల్ జంక్షన్ వరకు సుమారు రూ.1900కోట్ల వ్యయంతో కర్ణాటక ప్రభుత్వం తలపెట్టిన స్టీల్ ఫ్లైవోవర్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయటమేనంటూ లోక్‌సత్తా నేతలు పార్టీల కతీతంగా చేపట్టిన కార్యక్రమాలకు నగరవాసులు పెద్దఎత్తున స్పందించారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి కనెక్టివిటీ కోసమంటూ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు రూపకల్పనలో పారదర్శకత, నిపుణుల పరిశీలన, పౌరసమాజ అభిప్రాయాల పరిగణ వంటి ధోరణులేవీ లేవని, అనేక చెట్లను కూడా ఇందుకోసం ధ్వంసం చేయాల్సి ఉంటుందని లోక్‌సత్తా నేత, సిటిజన్స్ అగనెస్ట్ స్టీల్ ఫ్లైవోవర్ (సీఏఎస్ఎఫ్) సమన్వయకర్త శ్రీనివాస్ అలవిల్లి అన్నారు. దీనికి బదులు చిన్న సిగ్నల్ ఫ్రీ ఫ్లైవోవర్‌లు నిర్మిస్తే రూ.100కోట్ల వ్యయంతోనే ట్రాఫిక్‌ను తేలిగ్గా నియంత్రించవచ్చున్నారు. స్టీల్ ఫ్లైవోవర్ నిర్వహణ ఖర్చు కూడా భారీగానే ఉంటుందన్నారు. ఎలక్ట్రానిక్స్ సిటీకి నిర్మించిన ఎలివేటెడ్ రోడ్డులాగే ప్రతిపాదిత స్టీల్ ఫ్లైవోవర్ కూడా అనవసర భారంగా మిగిలిపోతుందన్నారు. ఇలాంటి ప్రజావ్యతిరేక ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టటం భవన నిర్మాణ సంస్థల నైతిక నిబంధనలకు వ్యతిరేకమని కాంట్రాక్టు తీసుకున్న ఎల్ అండ్ టీ సంస్థకు కూడా తెలియచేశామన్నారు.

'స్టీల్ ఫ్లైవోవర్ బేడా' (స్టీల్ ఫ్లైవోవర్ వద్దనిచెప్పండి) నినాదంతో ఇచ్చిన నిరసన పిలుపునకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారని, బ్రాండ్ లోక్‌సత్తా ఆందోళన పద్ధతులతో రోడ్లకు ఇరువైపులా






The Congress, bent on suicide, lost Kerala first.
Now it's losing Karnataka for a flyover

ministers neck-deep in corruption, he rejected the High Command's suggestions aimed at | was just after the Hebbal junction, the flyover blueprint was hastily extended to include | Bangaloreans saw this and turned out in their thousands to form a human chain of pro- | The dynastic hold is proving counter-productive at every turn. In UP, where it had no

నిలబడి ప్రజలకు ఇబ్బందిలేకుండా 5,000మంది నిరసన వ్యక్తం చేయటం, ఇందులో ప్రజలతోపాటు మాజీ లోకాయుక్త సంతోష్ హెగ్డే, చరిత్రకారుడు రామచంద్ర గుహ, కళాకారుడు ఎస్‌జీ వాసుదేవ్, ఆర్కిటెక్ట్‌లు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నమ్మ బెంగళూరు వంటి స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. అనేకమంది కుటుంబసభ్యులతో సహా వచ్చారన్నారు. ఆందోళనకారులకు ప్లకార్డులు, పతాకాలు అందించటంతోపాటు అవి రోడ్ల మీద చెత్త సమస్యను సృష్టించకుండా కార్యక్రమం ముగిశాక వాటిని తిరిగి సేకరించేందుకు వలంటీర్లు ఎంతో క్రమశిక్షణతో పనిచేశారన్నారు. పరిణతి కలిగిన ప్రజాస్వామిక ఉద్యమంగా దీన్ని మలచటానికి లోక్‌సత్తా నేతలు అశ్విన్ మహేష్, తారా కృష్ణస్వామి తదితరులు ఎంతో సృజనాత్మక, నిర్మాణాత్మక కృషి చేశారన్నారు. ప్రజలతో విస్తృతంగా చర్చించి తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం చేకూరేలా పరిష్కారాన్ని రూపొందించేంత వరకూ పోరాడతామని శ్రీనివాస్ అలవిల్లి తెలిపారు. ❍

## సివిల్ కోడ్‌పై చర్చ మతాలకతీతం కావాలి, మానవ హక్కులు, స్త్రీ సమానత్వం, పిల్లల భవిష్యత్తు కోసం చట్టాలు అవసరం: జేపీ




దేశవ్యాప్తంగా సివిల్ కోడ్ (ఉమ్మడి పౌరస్మృతి)పై జరుగుతున్న చర్చ మతాలకతీతంగా ఉండాలని, మానవ హక్కుల్ని, మహిళల సమానత్వాన్ని, బిడ్డల భద్రతను పరిరక్షించేందుకు చట్టాలు అవసరమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. మహిళలకు ఆస్తి హక్కు లేదని హిందువులు చెప్పటం, పిల్లలతో ఉపవాసం చేయించటం మతమని జైనులనటం, తలాక్, బహుభార్యాత్వాన్ని ముస్లింలు ఆమోదించటం– ఇవన్నీ తప్పిదాలేనన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించాలని, మేనరికపు వివాహాల్ని, ట్రిపుల్ తలాక్ విడాకుల పద్ధతిని, బహుభార్యాత్వాన్ని నిషేధించాలని అన్నారు. దగ్గరి బంధువులతో వివాహాలు భారత్‌లోని దాదాపు అన్ని విశ్వాసులలో కనిపిస్తుందని, ఇలాంటి వివాహాల వల్ల పుట్టే బిడ్డల్లో జన్యులోప వైకల్యాలు తలెత్తే అవకాశమున్నందున వీటిని నిషేధించాలన్నారు. అందుకే అన్ని మతాలు, సంప్రదాయాలలో రక్తసంబంధీకులతో పెళ్లిళ్లపై నిషేధాలున్నాయన్నారు. అయితే జన్యు పరిజ్ఞానం లోపించడం వల్ల ఈ సంబంధాల పరిధిని సంకుచితంగా నిర్వచించారన్నారు. మూడు సార్లు తలాక్ చెప్పి విడాకులివ్వడం, అనేకమంది మహిళల్ని వివాహం చేసుకోవడం ఈ ఆధునిక యుగంలో మహిళల హక్కులను కాలరాయడమేనని, ఇలాంటి వాటిని తిరస్కరించాలన్నారు. 'సతి', బాల్యవివాహాలు వంటి దురాచారాల్ని చాలావరకు రూపుమాపినట్టే.. వివక్ష, మహిళలకహక్కుల్ని అణగదొక్కటం వంటి వైఫల్యాల్ని కూడా సరిదిద్దుకోవటానికి హిందూ మతం ముందుకు రావాలన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన తదితర మతాలన్నీ శాస్త్రీయత, మానవ హక్కులు, సమానత్వం వంటి ఆధునిక భావాలకనుగుణంగా వ్యవహరించాలన్నారు. ఇది మెజారిటీ – మైనారిటీకి సంబంధించిన అంశం కాదని, మన మంచి కోసం, మెరుగైన భవిష్యత్తు కోసం మతంలో చెడును వదిలేయటమే పురోగమనం, నాగరికత అన్నారు. మహిళలకు 18 ఏళ్లు, పురుషులకు 21 ఏళ్లు వివాహ అర్హత వయసుగా మన చట్టం చెబుతోందని, విస్తృత ప్రయోజనం దృష్ట్యా ఇది మతాలన్నిటికీ వర్తిస్తుందని అన్నారు. మతం, సంప్రదాయం పేరుతో కొందరి హక్కులకు, పిల్లల భవిష్యత్తుకు సమస్యలు సృష్టించినప్పుడే చట్టాలు అవసరమవుతాయని, మిగతా విశ్వాస అంశాలలో ప్రభుత్వానికేమీ ప్రమేయం ఉండదని జయప్రకాష్ నారాయణ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ❍



భారతదేశ ఎన్నికల్లో రాజకీయ ఆర్థిక కోణం, ఎన్నికల్లో అవినీతి ప్రభావం, ప్రజల సాధికారతకు పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, వికేంద్రీకరణ ఆవశ్యకత తదితర అంశాలపై హైదరాబాద్‌లోని ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) కార్యాలయంలో లీ క్వాన్ యూ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ, సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ సీనియర్ విజిటింగ్ ఫెలో, ఫైనాన్షియల్ టైమ్స్ కంట్రిబ్యూటింగ్ ఎడిటర్ డా॥ జేమ్స్ క్రాబ్‌ట్రీతో ఆలోచనలు పంచుకున్న ఎఫ్‌డీఆర్ బృందం

Posting Date 07-11-2016
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on November 1st, 2016




Book-Post
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B, 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad